# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 14-8-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :25 | సంచిక: 277 | పేజీలు 8 | వెల: రూ.1/-


## రిలీఫ్ ఫండ్‌కు సీఎం ఫడ్నవిస్, మంత్రుల నెల జీతం విరాళం

మహారాష్ట్ర, ఆగష్టు 13: మహారాష్ట్రలో గత కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైన విషయం తెలిసిందే.

వరదల్లో నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలు కొనసాగిస్తోంది. బాధితుల సహాయార్థం మహారాష్ట్ర సీఎం దేవేంద్రఫడ్నవిస్, మంత్రులు తమ నెల జీతాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ కు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

మహారాష్ట్రలోని కొల్హాపూర్, సాంగ్లి జిల్లాలోని పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. వరద ముంపుతో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 40కి చేరింది. గత వారం సాంగ్లి జిల్లాలో పడవ మునిగిపోయి ఐదుగురు మృతి చెందగా..రెస్క్యూ టీం మృతదేహాలను వెలికితీసింది. వీటితోపాటు వివిధ ప్రాంతాల్లో వరదలతో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం ఇప్పటివరకు 4,14000 మందిని పునరావాస శిబిరాలకు తరలించింది.

# 16న భారీగా చేపపిల్లల విడుదల

-మంత్రి తలసాని

### కాళేశ్వరం సహా అన్ని జలాశలాయాల్లో విడుదల చేయాలని అధికారులకు లేఖ

హైదరాబాద్, ఆగష్టు 13: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు అన్నింటిలోనూఈ నెల 16న భారీగా చేపపిల్లలు, రొయ్యలు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కాళేశ్వరం సహా అన్ని జలాశలాయాల్లో చేపపిల్లలు, రొయ్యలను విడుదల చేయాలని అధికారులకు మంత్రి లేఖ రాశారు. ఈ ఏడాది మొత్తం 24వేల నీటి వనరులలో 80కోట్ల చేప పిల్లలు సహా 5కోట్ల రొయ్య పిల్లల్ని కూడా విడుదల చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కోటి చేప పిల్లలు, 26లక్షల రొయ్య పిల్లలను మంత్రి ఆధ్వర్యంలో విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని మంత్రి తలసాని ఆదేశించారు.

# బిఆర్‌కె భవన్ పరిశీలించిన సిఎస్

### అధికారికంగా కార్యకలాపాల కొనసాగింపు

హైదరాబాద్,ఆగష్టు13 (ఆర్ ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వ తాత్కాలిక సెక్రటేరియట్ అయిన బిఆర్‌కె భవన్ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి పరిశీలించారు. కొత్తగా ఏర్పాటుచేసిన తన ఛాంబర్‌ను పరిశీలించారాయన. తన పేషీ సంబంధిత పీఎస్‌ల ఛాంబర్ లలోనూ రిపేర్లు చేయాలని సూచించారు ఆ తర్వాత.. తన క్వార్టర్స్ కుందన్ బాగ్ కు వెళ్లిపోయారు. బిఆర్‌కె భవన్ కు ప్రధాన శాఖలు ఇప్పటికే షిఫ్ట్ అయ్యాయి. ఈ భవన్ నుంచి స్పెషల్ సీఎస్ అధర్ సిన్హా, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతి కుమారి, మరికొంతమంది అధికారులు ప్రభుత్వ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సెక్రటేరియట్‌లో, అధికారులు బిఆర్‌కె భవన్ లో విధులు నిర్వహిస్తున్నారు. బిఆర్‌కె భవన్ అందుబాటులోకి రావడంతో ఇక ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# రాజ్యసభకు మన్మోహన్ నామినేషన్

### రాజస్థాన్ నుంచి అవకాశమిచ్చిన కాంగ్రెస్

జైపూర్,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండు నెలల క్రితం బీజేపీకి చెందిన సభ్యుడు మదన్‌లాల్ సైనీ మృతితో ఖాళీ అయిన స్థానానికి ఈ నెల 26న ఎన్నికలు జరుగనున్నాయి. మూడు దశాబ్దాలుగా అసోం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మన్మోహన్‌సింగ్‌కు.. ఈ దఫా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. 1991 నుంచి 2019 వరకు వరుసగా ఐదుసార్లు మన్మోహన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు.

2004 నుంచి 2014 వరకు రెండుసార్లు వరుసగా ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 100 మంది సభ్యుల బలం ఉన్నది. అలాగే 12 మంది స్వతంత్య సభ్యులు కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో మన్మోహన్‌సింగ్ గెలుపు నల్లేరుపై నడక కానున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. మదన్‌లాల్ సైనీ మృతితో ఖాళీ అయిన స్థానానికి నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం.. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా ఆగష్టు 14గా పేర్కొన్నది. 26వ తేదీన అవసరమైతే ఎన్నిక నిర్వహించి అదేరోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ చేపట్టనున్నారు.



రాజస్థాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన మాజీ ప్రధాని మన్మోహన్

# కేటీఆర్ ట్వీట్‌పై సర్వత్రా హర్షం

### కాలుష్యాన్ని నివారించాల్సిందే అని పిలుపు

హైదరాబాద్,ఆగష్టు13 (ఆర్ ఎన్ఎ): గణెశిశ నిమజ్జనం సందర్భంగా నీరు కాలుష్యం కాకుండా చూసేందుకు గుజరాత్ అహ్మదాబాద్‌లో అనుసరిస్తున్న విధానాన్ని హైదరాబాద్‌లో అనుసరించడంపై అధ్యయనం చేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్‌కు సూచించారు. అహ్మదాబాద్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాలను సబర్మతి నదిలో వేయకుండా ఒడ్డునే వదిలివేళ్లేలా అక్కడి ప్రజల్లో చైతన్యం తీసుకురాగలిగారు. ఇదే విధానాన్ని మనం హైదరాబాద్‌లో ఎందుకు అమలుచేయలేమని కేటీఆర్ ట్వీట్ చేశారు.

దీనిపై పర్యావరణ వేత్తలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాల నిమజ్జనం వల్ల హుస్సేన్ సాగర్ ఇప్పటికే కాలుష్యకాసారంగా మారిందన్నారు. దీనిని తప్పించగలిగితే ఎంతోమంచిదన్నారు. హైదరాబాద్లఓ కాలుష్యంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే పలువురు నగర వాసులు కూడా కెటిరా÷- ట్వీట్‌పై స్పందించి స్వాగతించారు.

### చరిత్రలో నేటినిజం

కం॥ డబ్బింగు ప్రాభవలందున
నబ్బోయును పించు రీతి నమలెవను నిజముననే
కబ్బమ్మె రాజశ్రీ
అబ్బిబ్బౌ నరించి నాడు-తగ - ప్రేక్షకులన్!!

( ఆగష్టు 14 డబ్బింగ్ రచయిత రాజశ్రీ పుణ్యతిథి) -రాధశ్రీ

సెల్: 9494481210

# తుగ్లకాబాద్‌లో రవిదాస్ ఆలయం కూల్చివేత

### పంజాబ్‌లో ఉద్రిక్తత

న్యూఢిల్లీ,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని దిల్లీలోని తుగ్లకాబాద్‌లో 500 సంవత్సరాల నాటి శ్రీ గురు రవిదాస్ ఆలయాన్ని కూల్చివేయడంపై పంజాబ్‌లోని రవిదాసియా సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయం కూల్చివేయడాన్ని నిరసిస్తూ పంజాబ్ వ్యాప్తంగా ఆందోళన చేపట్టింది. బంద్ ప్రకటించింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మూతబడ్డాయి. పలు ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి.

# ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం

- భద్రతా దళాలు కాశ్మీరీలతో కలిసిపోతున్నాయి
- తుపాకులు వాడకుండానే వారితో మమేకమవ్వటమే మా ఆలోచన
- ఆమేరకు ప్రయత్నం చేస్తున్నాం

– ఆర్మీచీఫ్ జనరల్ బిపిన్ రావత్

న్యూఢిల్లీ, ఆగష్టు13(ఆర్ఎన్ఎ) : దేశ సరిహద్దుల వెంబడి ఎలాంటి ప్రతికూలతలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా భారత సైన్యం తిప్పికొడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. ఆర్మీ ఎప్పుడూ సర్వసన్నద్ధంగా ఉంటుందన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.. అధీన రేఖ వెంబడి పాక్ తన ఉనికిని పెంచుకుంటూ పోతోందా అని మీడియా అడిగిన ప్రశ్నకు రావత్ సూటిగా స్పందించారు. నిరోధులు అధీనరేఖ వెంబడి తమ కార్యకాలాపాలను చురుకుగా సాగించాలనుకుంటే అది వారి ఇష్టమని అన్నారు. ముందస్తు మోహరింపులు అనేవి తప్పనిసరిగా ఉంటాయని, దీని గురించి తమకు ఎలాంటి ఆందోళన లేదని చెప్పారు. ఆర్మీ, ఇతర సేవల విషయానికి వస్తే, మనం ఎప్పుడూ సర్వసన్నద్ధంగానే ఉంటామని రావత్ స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ లోయలో పరిస్థితిపై మాట్లాడుతూ, 70–80వ దశకంలో ప్రజలతో తాము ఎంతగానో మమేకమయ్యేవాళ్లమని, అలాంటి పరిస్థితినే మళ్లీ తాము కోరుకుంటున్నామని అన్నారు. 'అక్కడ మా బలగాలు మోహరించాయి. తుపాకులు వాడకుండానే ప్రజలతో మమేకమవ్వాలనేది మా ఆలోచన. అంతా సవ్యంగా జరిగేత తుపాకులు పక్కనపెట్టేసి ప్రజలతో ఉల్లాసంగా కలిసిపోతాం' అని రావత్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం, జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడంపై పాక్ కారాలు మిరియాలు నూరుతుండటం, మరో పుల్వామా తరహా దాడి జరగొచ్చని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో బిపిన్ రావత్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# లెకిమా టైఫూన్ బీభత్సం

### 49 మంది మృతి..లక్షలాదిమంది నిరాశ్రయులు

బీజింగ్,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): చైనాలో లెకిమా టైఫూన్ బీభత్సం సృష్టించింది. టైఫూన్ ధాటికి 49 మృతి చెందగా 21 మంది గల్లంతయ్యారు. ఝిజయాంగ్ అనే ప్రాంతం టైఫూన్ ధాటికి అతలాకుతలమైంది. భారీగా వర్షాలు కురుస్తుండగా నదులు, వాగులు వంకలు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి.. టైఫూన్ ధాటికి ఇండ్లు కూలిపోవడంతో పాటు కొండ చరియలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలలో ఉన్న 12 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ టైఫూన్ 66 లక్షల మందిపై ప్రభావం చూపుతోంది. మృతుల సంఖ్య వందలలో ఉంటుందని స్థానిక మీడియా వెల్లడించింది. గల్లంతైన వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఝిజయాంగ్ ప్రజలు కూడా వాపోతున్నారు.

### ప్రతీఒక్కరూ హరితహారంలో

# భాగస్వాములు కావాలి

- ఇంటింటికి ఆరు మొక్కలు నాటాలి
- విద్యాశాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- ఇమాంపేటలో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

సూర్యాపేట, ఆగష్టు13(ఆర్ ఎన్ఎ) : రాష్ట్రాన్ని పచ్చని వనంలా మార్చేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తుందని, ప్రతీ



ఒక్కరూ హరితహారంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం

సూర్యాపేట నియోజకవర్గాన్ని హరితవనంలా చేసేందుకు నియోజకవర్గంలోని 103 గ్రామ పంచాయతీల్లో 5.50 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రు. సూర్యాపేట మండలం ఇమాంపేట నుంచి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులతో కలిసి ఏకకాలంలో లక్ష మొక్కలు నాటే హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే మండలాల వారీగా హరితహారం టార్గెట్‌లు పెట్టిన మంత్రి వాటిని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు గ్రామ పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో 40 వేల మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీఒక్కరం ముందుకుసాగాలని అన్నారు. ఇందుకుగాను మండలాల వారిగా హరితహారం టార్గెట్‌లను పెట్టడం జరిగిందని, నియోజక వర్గం పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి మొక్కలు నాటడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఇంట్లో ఆరు మొక్కలు నాటాలే అధికారులు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. హరితహారం టార్గెట్‌ను ఒకే రోజు మండల వ్యాప్తం గా నాటే విధంగా ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని, ఇందుకుగాను తాను నాలుగు రోజుల పాటు నాలుగు మండలాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, అన్నివర్గాల ప్రజలు సైతం పాల్గొననున్నారని, ఇప్పటికే మొక్కలను గ్రామాలకు తరలించగా నాటేందుకు గుంటలు సైతం తీయించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, మన గ్రామాలను మనం పచ్చని పల్లెలలుగా మార్చుకొనేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో కర్నాటక అతలాకుతలం

### వరద ప్రాంతాల్లో సిఎం యెదుయూరప్ప ఏరియల్ సర్వే
### 50వేల కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా
### కేంద్రాన్ని తక్షణ సాయంగా 10వేట కోట్లు అడుగుతామని వెల్లడి

బెంగళూరు,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, వరదల వల్ల కర్ణాటక అతలాకుతలమవుతోంది. ఎడతెరిపిలేని వర్షాలకు లోతట్టు, నదీపరివాహక ప్రాంతాలు నీటమునిగాయి. భారీ ఎత్తున రాష్ట్రంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. కర్ణాటక ముఖ్యమంత్రి యెడీయూరప్ప వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం యెడ్డీ మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఏరియల్ సర్వే చేశారు. వరదల వల్ల సుమారు రూ.50వేల కోట్ల మేర ఆస్తి నష్టం జరిగింది. ఆగష్టు 16న ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలిసి వరద పరిస్థితి గురించి వివరిస్తా. వరద పరిస్థితులపై ఇవాళ శివమొగలో స్థానిక ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చిస్తా. తక్షణమే రూ.10వేల కోట్లను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని' యెడీయూరప్ప పేర్కొన్నారు. వరదల ధాటికి రాష్ట్రంలో 48 మంది మృతి చెందగా.. 12 మంది గల్లంతయ్యారు. వేలాది మంది నిరాశ్రయుల య్యారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరదల తాకిడికి చందనసీమ బురదమయమై విలవిలలాడుతోంది. వరుసగా ఏడేళ్ల పాటు కర్ణాటకను కరవు వెంటాడింది. మధ్యలో వచ్చి పోయే అతివృష్టి మాత్రం కరవు బాధను కసితీరా పోగొట్టి మరో కొత్త సమస్యను మిగిల్చింది. పదేళ్లలో మూడుసార్లు రికార్డు స్థాయి వర్షాలతోపాటు వణుకు పుట్టించే వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పదేళ్లలో కష్టమొచ్చిన ఆ రెండుసార్లూ భాజపా అధికారంలో ఉండటం గమనార్హం. తాజా వరదలు సృష్టించిన నష్టం అంతా ఇంతా కాదు. ఇప్పుడిప్పుడే రాజకీయ సంక్షోభం నుంచి తేరుకుంటున్న రాష్ట్రానికి వరద గాయాలను మిగిల్చింది. గతేడాది ఆగస్టులో కొడగును కుదిపేసిన కుంభవృష్టి అక్కడి పర్యాటకాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. చిక్కమగళూరు, కొడగు జిల్లాల్లోని వేలాది ఎకరాల కాఫీ తోటలు, ఏటా కోట్ల రూపాయల ఆదాయాన్ని సృష్టించే పర్యాటకం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అప్పటి సంకీర్ణ ప్రభుత్వం వరదల వల్ల జరిగిన నష్టం రూ.6వేల కోట్లు అని నిర్ధరించి కేంద్రాన్ని సాయం కోరింది. నాటి నష్ట నేపథ్య సాయం ఇంత వరకు అందలేదన్న అపవాదును భాజపా మోస్తోంది. ముఖ్యమంత్రి రూ.2వేల కోట్లను తక్షణమే చెల్లించాలని కేంద్రాన్ని కోరినా ఇంత వరకు రూ.250 కోట్లకు మించి పరిహారం చెల్లించలేదని సంకీర్ణ ప్రభుత్వం ఆరోపిస్తూనే అధికారం నుంచి తప్పుకొంది. అప్పటి రక్షణ శాఖ మంత్రి, నేటి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చి వెళ్లినా పరిహారం అందలేదన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో కొడగుతో పాటు కేరళ కూడా అతివృష్టితో భారీ నష్టాన్ని ఎదుర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేరళకు రూ.600 కోట్లు ప్రకటించినా కర్ణాటకకు రూ.110కోట్లు మాత్రమే తొలివిడతగా ఇచ్చారని కాంగ్రెస్ గొడవ పెట్టుకుంది. తాజా వరదలను ఇపుడు మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు హోం మంత్రి అమిత్ షా కూడా ప్రత్యక్షంగా చూసి వెళ్లారు. రాష్ట్రంలో భాజపా అధికారంలో ఉండగా ఎంత సాయం అందుతుందో తెలియాలంటే మరో వారం వేచి చూడక తప్పదు.

# రాగల రెండ్రోజుల్లో మోస్తరు వర్షాలు

### బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం

హైదరాబాద్,ఆగష్టు13 (ఆర్ ఎన్ఎ): రాగల మూడ్రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈశాన్య బంగాళాఖాతం, దానిని ఆనుకొని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీనికి అనుబంధంగా 7.6 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది రాగల 48 గంటల్లో మరింత తీవ్రంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఫలితంగా తెలంగాణలో రాగల మూడ్రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించారు. ఒకట్రెండు రోజులు కొన్నిచోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాగల మూడ్రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

## వరద బాధితుల కోసం రూ.2.79 కోట్ల విరాళం

న్యూఢిల్లీ,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): ఉత్తర భారతం వర్షాలతో వణికిపోతోంది. కశ్మీర్ నుంచి కేరళ వరకు ఏడు రాష్ట్రాల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. మొత్తంగా 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్‌లలో వరదల దెబ్బకు 214 మంది మరణించారు. దీంతో వరద బాధితులను ఆదుకునేందుకు అమృతా షెర్‌గిల్ తన పేయింటింగ్స్ ను అమ్మకానికి పెట్టారు. వచ్చిన సొమ్మును వరద బాధితులకు ఇస్తున్నామని ప్రకటించారు. ఢిల్లీలో తాజ్ పబ్లిక్ సర్వీస్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 25 చిత్రాలను వేలం వేశారు.

# బాల వికాసం

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, ఆలూరు మండలం, చిప్పగిరి గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పుల్లా రామాంజనేయులు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులచే కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కవి సమ్మేళనంలో ఉపాధ్యాయులు ఎస్. జమాలుద్దీన్, కె. ఆదిలక్ష్మిలు సహకరించారు. ఇలా ఆయా పాఠశాలల్లో విద్యార్థులచే కవి సమ్మేళనాలు నిర్వహించడం అభినందనీయం. చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు మా అభినందనలు.


పుల్లా రామాంజనేయులు


కె. ఆదిలక్ష్మిలు


ఎస్. జమాలుద్దీన్

–సంపాదకులు

## స్వచ్ఛ భారత్

భారత్‌ని నిర్మిద్దాం
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం
వీధులన్నీ శుభ్రంగా ఉంచుదాం
చెరువులన్నీ తవ్వి ఉంచుదాం
మురికి కాలువలని నీటుగా ఉంచుదాం
తడిపొడి చెత్తను వేరుచేద్దాం
జీవ ఎరువులుగా మార్చుకుందాం
మరుగుదొడ్లని నిర్మిద్దాం
అనారోగ్యాన్ని దూరంగా పారద్రోలుదాం
చేతులని చక్కగా కడుక్కుందాం
రోజు బడికి వెళుదాం
ఎన్నో మొక్కలు నాటుదాం
వృథా నీటిని మొక్కలికి పారిద్దాం
బడిని బృందావనం చేద్దాం
స్వచ్ఛ భారత్‌ని నిర్మిద్దాం.



– వై.చంద్రిక
9వ తరగతి, చిప్పగిరి
కర్నూలు జిల్లా.

## ప్రగతి ఫలాలు

మొక్కలు మొక్కలు
పెంచుదాం మొక్కలు
నాటుతాం మొక్కలు
స్వేచ్ఛనిచ్చే మొక్కలు

మొక్కలు మొక్కలు
మా ప్రాణం మొక్కలు
నేటి తరానికి మొక్కలు
భావితరానికి మొక్కలు

నేటి బాలలకు నీడనిచ్చే మొక్కలు
స్వచ్ఛమైన ఫలమునిచ్చే మొక్కలు
ప్రగతికి మేలు చేసే మొక్కలు



–పి.పి.మైత్రి
9వ తరగతి9వ తరగతి, చిప్పగిరి
కర్నూలు జిల్లా.

## ఎన్నడో

పిల్లలు ఆటలాడేదెన్నడో?
పాటలు పాడేదెన్నడో?
హాయిగా పార్కుకు వెళ్ళేదెన్నడో?
అమ్మ, నాన్నలను మురిపించేదెన్నడో?

అవ్వ, తాతలతో గడిపేది ఎన్నడో?
సరిగా అక్షరాలు రాసేదెన్నడో?
పాఠం వినేది ఎన్నడో?
టచ్ సెల్‌లో గేమ్స్ ఆడెదెన్నడో?

ఊర్లకు వెళ్ళేదెన్నడో?
గుడికి వెళ్ళేది ఎన్నడో?
సీరియల్స్ చూసేది ఎన్నడో?
ఉత్సాహంగా గడిపేదెన్నడో?

మాతృభాషలో రాసెదెన్నడో?
తెలుగు మీడియం జేరినపుడో!?
ఈలలు వేస్తూ తిరిగేదెన్నడో?
ఆదివారం నాడు ఆడేదెన్నడో?



– కె. సతీష్
9వ తరగతి
జడ్.పి.హెచ్. స్కూల్,
రూ.నెం. 23, చిప్పగిరి

## తీపి కబురులం

బాలలం బాలలం
తీపి కబురుల బాలలం
పూజించే బాలలం
ప్రశ్నించే బాలలం
పరిగెత్తే బాలలం
చదివే బాలలం
ఆటపాటల బాలలం
చిలుక పలుకుల బాలలం
ఎంతొ తీయనైన బాలలం
అలరించే బాలలం
ఆటపట్టించే బాలలం
మేమే బాలలం
ముద్దు ముద్దు బాలలం.



–టి. అంజి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్ చిప్పగిరి

## ఎదుగుదాం

ఎదుగుదాం ఎదుగుదాం
చెట్లలాగా ఎదుగుదాం
ఆడపిల్ల అయినా భయం లేదందాం
మేము కూడ సమానం అందాం.

ప్రతివారిని పోటీపరుచుదాం
గెలిస్తే ప్రొత్సహిద్దాం
ఒడిపోతే ధైర్యం ఇద్దాం
పుస్తకాలను చదివేద్దాం.

వాటిలో ఎన్నొ విషయాలు తెలుసుకుందాం
తెలుసుకొని ఇతరులకు పంచుదాం
జ్ఞానాన్ని పొందుదాం
పొంది పరులకు పంచుదాం

విత్తనమై మొలకెత్తుదాం
చెట్టై విరుబూద్దాం
లేత చిగురాకులను తయారు చెద్దాం
ఎదుగుదాం ఎదుగుదాం
పై పైకి ఎదుగుదాం.



– బి. రాజేశ్వరి
9వ తరగతి
రూల్.నెం. 16
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,చిప్పగిరి

## విశాలమైన దేశం

విశాలమైన దేశం
భారత దేశం
సుందరమైన దేశం
భారత దేశం

పాడి పంటల
భారత దేశం
హిమాలయాల దేశం
భారత దేశం

జీవనదులు పుట్టిన దేశం
భారత దేశం
అందమైన దేశం

భారతదేశం
సంప్రాదాయాల దేశం
భారత దేశం
పచ్చదానం పంచే దేశం
భారతదేశం.



– ఎం.మౌనిక
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,చిప్పగిరి

## ముత్యపు చినుకులు

వాన వాన రావమ్మ
రైతులకు నువ్వె దేవతవమ్మ
నువ్వుంటెనే ప్రజలు బ్రతుకుతారమ్మ
నువ్వొస్తేనే మాకు పండగమ్మ

వాన వాన రావమ్మ
పంటలకు ప్రాణం నీవమ్మ
అన్నదాత ఆకలి తీర్చేవమ్మ
నిన్ను నమ్ముకొని ఉన్నామమ్మ

వాన వాన రావమ్మ
అన్న దాతలందరిని అలరించవమ్మ
ముత్యపు చినుకులు కురిపించవమ్మ
ముసి ముసి నవ్వులు చూడమ్మ

వాన వాన రావమ్మ
కడుపు నింపే దేవత నీవమ్మ
అందరు చెట్ల నాటుతమమ్మ
అందరి ఆనందం చూడవమ్మ.

– డి. భవాని
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,చిప్పగిరి

## చిలుక చిలుక రావమ్మ

చిలుక చిలుక రావమ్మా
అందమైన నీ రూపం చూపమ్మా

నీ ఎర్రటి ముక్కు చూపమ్మ
పచ్చని ఆకుల్లో ఉంటావమ్మ

గగనానికి ఎగిరి రావమ్మ
రామ రామ అని అరవమ్మా

ఒక కాయ మాకు ఇవ్వమ్మా
ఎంత తీయ్యగా ఉంటాదమ్మా

చిలుక చిలుక రావమ్మ
అందమైన రూపం చూపమ్మా



– టి. అర్జున్
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,
చిప్పగిరి

## రంగు రంగుల జెండా

రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
స్వేచ్ఛనిచ్చే జెండా
అందమైన జెండా

రంగురంగుల జెండా
మూడు రంగుల జెండా
కాషాయం రంగు
త్యాగానికి గుర్తురా

రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
తెలుపు రంగురా
శాంతికి గుర్తురా

రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
ఆకుపచ్చ రంగురా
పాడి పంటలకు గుర్తురా

రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
అశోక చక్రం కలదురా
దేశమంతటా ఎగిరెరా.



– పి. గోవిందమ్మ
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,చిప్పగిరి



## వారాల బాలుడు

ఆదివారం పుట్టిన బాలుడు
అద్భుతంగా చదువుతాడు
సోమవారం పుట్టిన బాలుడు
సత్యమునే పలుకుతాడు
మంగళవారం పుట్టిన బాలుడు
మంచి పనులు చేస్తాడు
బుధవారం పుట్టిన బాలుడు
బుద్ధిమంతుడై ఉంటాడు
గురువారం పుట్టిన బాలుడు
పరోపకారం చేస్తాడు
శుక్రవారం పుట్టిన బాలుడు
సహనం కలిగి ఉంటాడు
శనివారం పుట్టిన బాలుడు
శాంతియుతంగా ఉంటాడు.



– డి. రవిత్రేయిణి
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,చిప్పగిరి



## మాతృదేవోభవ

నవమాసాలు మోసేది అమ్మ
నవ్వుతో మెలిగేది అమ్మ
బాధ పంచుకునేది అమ్మ
బాధను తీర్చేది అమ్మ
గాయం తగిలితే
కంగారు పడేది అమ్మ
అడుతూ పాడుతూ మెలిగేది అమ్మ
ఆకలి అంటే తీర్చేది అమ్మ
ఆపద వస్తే ఆదుకునేది అమ్మ
ప్రతివారిని గౌరవించేది అమ్మ
పండుగకు
పదిమందిని పిల్చేది అమ్మ
అక్కున చేర్చుకొనేది అమ్మ
హాయిగా చూసుకునేది అమ్మ
దేవుడైనా గొప్పకాదు.. అమ్మ కన్నా
ఆమె లేకపోతే ఈ లోకమే లేదు
అమ్మను మించిన దైవం ఉన్నదా!

–కె.అరుణ్
9వ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్. స్కూల్,
చిప్పగిరి

## చిలుకా- నీ వంటి రంగు

చిలుకా, చిలుకా నీ ఒంటి పచ్చ
ఎక్కడిదే! ఎక్కడిదే!
ఓ బుజ్జిపాప–ఓ బుజ్జిపాప
ఆకుల నడిగి అందుకున్నా!

కొంగా, కొంగా నీ ఒంటి తెలుపు
ఎక్కడిదే! ఎక్కడిదే!
ఓ బుజ్జిపాప–ఓ బుజ్జిపాప
పాల నడిగి–తెలుపు తెచ్చా!
కాకీ, కాకీ నీ ఒంటి నలుపు
ఎక్కడదే! ఎక్కడిదీ!
ఓ బుజ్జిపాప! ఓ బుజ్జిపాప
బొగ్గును అడిగి తెచ్చా!



– బి. స్రవంతి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్,చిప్పగిరి

## సాధిస్తాం

సాధిస్తాం సాధిస్తాం
మంచి మార్కులు సాధిస్తాం
చేసేస్తాం చేసేస్తాం
మంచి పనులు చేసేస్తాం.

గెలిచేస్తాం, గెలిచేస్తాం
ఆటలన్నీ గెలిచేస్తాం
ఆడేస్తాం ఆడేస్తాం
కబడ్డీ ఆటలు ఆడేస్తాం.

పాడేస్తాం పాడేస్తాం
కమ్మని పాటలు పాడేస్తాం
చదివేస్తాం చదివేస్తాం
చదువులమ్మను చదివేస్తాం.



– బి. మానస
9వ తరగతి,
జడ్‌పిహెచ్ స్కూల్,చిప్పగిరి

## అల్లరి పిల్లలు

పిల్లలార రారండి
చక్కగా బడికి వెళ్ళొద్దాం
గురువు చెప్పిన పాఠాలు వినేద్దాం
అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేదాం.

పిల్లలార రారండి
బడి గంట మోగింది
ఇంటికి చక్కగా వెళ్ళొద్దాం
చెప్పిన పనులు చేసేద్దాం.

పిల్లలార రారండి
అల్లరి బాగా చేసేద్దాం
వీధులగుండా తిరిగేద్దాం
ఆటలు ఆడుకొని వచ్చేద్దాం.

పిల్లలార రారండి
వర్షం బాగా పడింది
పడవలు చేసి ఇడుద్దాం
వాటిని చూసి గంతులు వేద్దాం.



– జి. సుస్మిత
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్,చిప్పగిరి

## చదివేస్తాం

పిల్లలలం పిల్లలం
బడికి వెళ్ళే పిల్లలం
పాఠాలన్ని చదివేస్తాం
ఆటలన్నీ ఆడేస్తామ్.

పరీక్షలలో ఫస్టవస్తామ్
బహుమతులు కొట్టేస్తామ్
ఆట, పాటలతో అలరిస్తాము
చదువు అంటే మాకిష్టం

అమ్మ, నాన్నల ప్రోత్సాహం
పిల్లల కెంతో ఉత్సాహం
పిల్లలంటేనే అల్లరి
అల్లరి అంటేనే పిల్లలు

స్నేహితులంతా కలిసి ఉంటాం
ఆటలన్నీ ఆడేస్తాం
కలిసి, మెలసి ఉంటాం
ఉన్నత విద్యనూ చదివేస్తాం.

పిల్లం పిల్లలం
ఆటలంటే మాకిష్టం
పాటలంటే మాకిష్టం
దాంతోపాటూ
చదువు అంటే ఇంకా ఇష్టం.



–వి. ఆర్తి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్,చిప్పగిరి

## చిట్టిచెల్లి

చెల్లీ చెల్లీ ఇటు రావే
నీకు బొమ్మలు గీసిస్తా
మంచి కథలు చెప్పిస్తా
గేయాలన్నీ రాసిస్తా.

నాన్న, నాన్న ఇది చూడు
కవితలు బాగా రాసేస్తా
బహుమతులెన్నొ గెలిచేస్తా
మంచి పేరును సాధించేస్తా

అమ్మ అమ్మ ఇక్కడికి రా
నీకు సాయం చేసిస్తా
కూరగాయాల్ని తెచ్చిస్తా
వంటలో సాయం చేసేస్తా.

అక్కా, అక్కా నేను వస్తా
ఇద్దరం కలిసి బజారుకెళ్ళాం
కంప్యూటర్‌ను నేర్చుకుని వద్దాం
పరీక్షల్లో మంచి మార్కులు తీసుకువద్దాం.



– యం. కీర్తి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్,
చిప్పగిరి

## నన్ను పెంచిన ఓ అమ్మా

నన్ను కన్న ఓ అమ్మా
నువ్వుంటేనే నా జీవితమమ్మ
నువ్వు లేనిదే నేను లేనమ్మ
నా ప్రాణం నువ్వమ్మ.

నవమాసాలు మోసావమ్మ
నీ రుణం తీరనిదమ్మ
సృష్టికి జీవం పోసినది నీవేనమ్మ
అమ్మంటే దైవం నీవేనమ్మ.

నడకలు నేర్పిన ఓ అమ్మా
నువ్వు చెప్పిందే నా మాటమ్మ
మంచి ప్రయోజకురాలుగా అవుతానమ్మ
నీకు గౌరవాన్ని తెస్తానమ్మా.

– వి.నందిని
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

## ఇష్టం

మా ఊరు అంటే మాకిష్టం
చెట్లు అంటే మా కిష్టం
చదువు అంటే మాకిష్టం
ఆటలు అంటే మాకిష్టం
కథలు అంటే మాకిష్టం
పాటలు అంటే మాకిష్టం
పిల్లలు అంటే మాకిష్టం
గురువులు అంటే మాకిష్టం
తల్లిదండ్రులు అంటే మాకిష్టం
గేయం అంటే మాకిష్టం
పూలు అంటే మాకిష్టం
అన్నం అంటే మాకిష్టం
పెద్దలు అంటే మాకిష్టం
మేమంటే మాకు ఇష్టం.



–ఎన్. మాధవి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్
చిప్పగిరి

## పువ్వులం

రంగు రంగుల పువ్వులం
బోసి నవ్వుల పువ్వులం
పరిమళించే పువ్వులు
మకరందాన్నిచ్చే పువ్వులం

రంగు రంగుల పువ్వులం
మల్లెతీగ పువ్వులం
సన్నజాజి పువ్వులం
బంతి పువ్వులం.

రంగు రంగుల పువ్వులం
గాయం మాన్చే పువ్వులం
మంచి మంచి పువ్వులం
ముసి ముసి నవ్వులం

రంగు రంగుల పువ్వులం
చామంతి పువ్వులం
పువ్వులం మేం పువ్వులం
అలరించే పువ్వులం.



– ఎం. సుస్మిత
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

## మంచి పిల్లలం

పిల్లలం పిల్లలం
ఎంతో చక్కని పిల్లలం
ఆటలన్నీ ఆడేస్తాం
పాటలన్నీ పాడేస్తాం

ఎంతో చక్కగా చదివేస్తాం
మంచి మార్కులు కొట్టేస్తాం
అన్ని ఆటల్లో పాల్గొంటాం
అన్ని బహుమతులు గెలుచుకొంటాం

అమ్మకు పనిలో సాయం చేస్తాం
నాన్న చెప్పిన పనులు చేసేస్తాం
కలిసి మెలసి జీవిస్తాం
పర్యావరణాన్ని రక్షిస్తాం.

ప్లాస్టిక్ వినియోగాలను తగ్గిస్తాం
పెద్దవాళ్ళను గౌరవిస్తాం
గురువులని పూజిస్తాం
పువ్వుల్లా వికసిస్తాం.



–జి. రజని
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్,చిప్పగిరి

## మా మంచి నాన్న

నాన్న, నాన్న మా మంచి నాన్న
అన్నం కలిపి ముద్దలు పెట్టావ్
అడుగులు మాకు నేర్పించావ్
చక్కని బాటను చూపించావ్.

నాన్న,నాన్న మా మంచి నాన్న
చదువులు మాకు చదివించావ్
ఆటలు మాకు ఆడించావ్
మంచి మార్గంలో నడిపించావ్.

నాన్న, నాన్న మా మంచి నాన్న
ప్రకృతి మాకు చూపించావ్
అడిగిన్న వన్ని ఇచ్చేస్తావ్
ప్రేమను మాకు పంచేస్తావ్.

నాన్న, నాన్న మా మంచి నాన్న
స్నేహాన్ని నాకు చూపించావ్
మంచి మాటలు చెప్పావ్
స్నేహాన్ని నాకు అందించావ్.



కె. మౌనిక
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

## గేయం

మా అమ్మ చేస్తుంది వంటలు
మా వీధిలో ఉంటాయి కుక్కలు
పచ్చగా ఉంటాయి పొలాలు
పొలంలో ఉంటారు మనుషులు

నాతో ఉంటాయి పుస్తకాలు
పొలం దున్నుతుంటాయి ఎద్దులు
గుడిలో వుంటారు దేవుళ్ళు
చెట్లకు కాస్తాయి పండ్లు

చెట్ల మీద వుంటాయి పక్షులు
మా పొలంలో వుంటాయి మొక్కలు
మాకు వుంటాయి తలపులు
చెట్లకు ఉంటాయి కొమ్మలు



– వి. రవి
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్
చిప్పగిరి

## నేర్చుకుంటాము

పిల్లలం మేం పిల్లలం
ప్రొద్దునే లేవాలి
పళ్ళుతోమాలి
స్నానం చేయాలి.

పిల్లలం మేం పిల్లలం
అన్నం తినాలి ఆరోగ్యంగా ఉండాలి
బడికి వెళ్ళాలి అన్ని నేర్వాలి
పంతులు చెప్పినవి వినాలి.

పిల్లలం మేం పిల్లలం
గంతులు వేయాలి
ఆటలు ఆడాలి
పాటలు పాడాలి.

పిల్లలం మేం పిల్లలం
బడిలో గంట మోగాలి
ఇంటికి పరుగులు తీయాలి
పిల్లలం మేం పిల్లలం.



– యం. మమత
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

## మాకిష్టం

అమ్మ నాన్న అంటే మాకిష్టం
వాళ్ళు చెప్పిన మాటలు వినెస్తాం
చెప్పిన పనులు చేసేస్తాం
అందుకు అమ్మ నాన్న అంటేట మాకిష్టం.

అవ్వ తాత అంటే మాకిష్టం
వాళ్ళు చెప్పిన కథలు వింటుంటాం
అడిగిన వన్ని ఇచ్చేస్తుంటాం
అందుకే అవ్వ తాత అంటే మాకిష్టం.

గురువులు అంటే మాకు గౌరవం
వాళ్ళు చెప్పిన పాఠాలు వింటుంటాం
ఇచ్చిన ఇంటిపనంతా చేస్తుంటాం
అందుకే గురువులు అంటే మాకు గౌరవం

స్నేహితులు అంటే మాకు ప్రాణం
చక్కగా ఆటలు ఆడేస్తాం
కలిసి మెలసి తిరిగేస్తాం
అందుకే స్నేహితులు అంటే
మాకు ప్రాణం.



– జె. తేజశ్విని
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

## మంచి పుస్తకం

మనకు చదువునేర్పేది పుస్తకం
భవిష్యత్తును చెప్పేది పుస్తకం
పదో తరగతి పాస్ చేసేది పుస్తకం
పరీక్షలకు చదివేలా చేసేది పుస్తకం

పుస్తకం, పుస్తకం
మంచి, మంచి పుస్తకం

చింపినా ఏమీ అనదు పుస్తకం
నలిపినా ఏమీ అనదు పస్తకం
కవులు రాసే పుస్తకం
ఉపాధ్యాయులు చదివే పుస్తకం

పుస్తకం, పుస్తకం
మంచి, మంచి పుస్తకం

మనం రాసేది పుస్తకం
విద్యార్థులు చదివేది పుస్తకం
గేయాలు రాయడానికి పనికొచ్చేది పుస్తకం
ఉపాధ్యాయులు నేర్పేది పుస్తకం.

పుస్తకం, పుస్తకం
మంచి, మంచి పుస్తకం



– కె. శశికళ
9వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్, చిప్పగిరి

సామాజిక త

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

బుధవారం 14-8-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

ఆత్మ సంచారం
వేదాంత చిక్కుముడి
జగన్నాటకం.

గోడ పత్రిక
అందాలపై మరక
వేస్తే చురక.

కొత్త చదరంగం
ఎత్తుతగ్గ అడుగు
రంగంలో ఒంటె.

గొట్టెల లెక్క
దస్త్రరంలో జమాఖర్చు
తోక బెత్తెడు.

కబోధి గోస
చిత్రలిపి భరోస
సర్వ దర్శితం.



- రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

అవసరమే గోదావరి
అందుతాయ జలాలు?
రాయలసీమ భూమిలో
పండుతాయ ఫలాలు?

రెండు రాష్ట్రాల సంపద
రెండు నదుల నీళ్ళు!
వాడుకుంటెసాగుభూమె
ఉండవండి బీళ్ళు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ప్రేమ

ప్రేమ
ఎంత తేలికైపోయిందిప్పుడు!
ఎంత చులకనై, అల్లరై భ్రష్టుపట్టిపోయింది
ప్రేమంటే ఆహ్లాద తరంగం కాదు
ఊహా ప్రపంచపు అనుకూల స్వప్నం కాదు
మదమెక్కిన ఆవేశం కాదు

ప్రేమ
తీగకు రెండువైపులా పూచిన సుమం
అది ఒక ప్రశాంత సమరం!
వీరుడైతేనే జయిస్తాడు
భీరువు, సంశయాత్ముడు పరాజితుడౌతాడు
చూపు, మాట, వక్రీభవనం చెందని కిరణంలా
లక్ష్యాన్ని స్పృశించాలి
అదే వేగంతో ఏడు వర్ణాలై తిరిగి రావాలి
లేఖయినా, ఆవిష్కరణయినా
హంసలా ఆవలి తీరాన్ని పలకరించాలి

మలయ పవనమై మరలిరావాలి
స్పష్టత, సాంద్రత లోపించినపుడు
వలపు విఫలమవుతుంది.
అలా.. ఏర్పడుతుందనటం ఓ కల్పన
ఓ చిత్త విభ్రమం
అలా.. ఏర్పడేది అలలాగానే తరలిపోతుంది
ప్రేమ భ్రమలో
ఆకర్షణ అర్హతను కప్పివేస్తుంది
ఆశ తారతమ్యాన్ని చంపివేస్తుంది
శాశ్వత ప్రేమ ఉపరితలంపై
బోటు షికారుకాదు
అగాథ జలరాశుల అవగాహన, పరిశోధన

ఆ తీరాన్ని చూడు

నిశీథపవనాలు మూర్ఛిల్లిన
నిర్ణిద్ర ప్రవాహంలో
గమ్యం చేరని ప్రేమలేఖ
కాగితం పడవై సాగిపోతోంది
అది పడవ కాదు
పలాయన ప్రయాణం
అది లేఖ కాదు
పరాజయ్యు పైకెత్తిన పతాకం.



- వై రామకృష్ణారావు
8985743964


## కవిత్వ కెరటాలు

అరణ్య రోదనం, సాగర సంగమం
చంద్రగ్రహణం, సూర్య ఆగ్రహం
గాలిమచ్చుట, దూళిమంట
అన్నీ కవిత్వమే నాకు
ఏదే దూరం కాబోదు.
రైతు వురితాడు నిరుపేద కన్నీరు
నిరుద్యోగి నిట్టూర్పు నిజాయితీకనుమరుగు
అవినీతి రాజ్యం నీతిజారిన సంఘం

అన్నీ వెంటాడుతున్నాయి
వస్తువు నేనంటున్నాయి.

కార్మికుని పిడికిలి, కవి ఆగ్రహం
రవి మేఘావృతం, చిరుగాలి దూళిమయం
చిన్నారి నవ్వులో భయం, డాక్టర్ డబ్బుపిచ్చి

నా ముందు నిల్చున్నాయి
శిల్పం వెదుకుతున్నాయి
లైంగిక దాడులు రాజకీయ బురదలు
ఎడారి వాగులు గల్ఫ్‌చీకట్లు
కల్తీ బ్రతుకులు కడతేరని దుఃఖాలు
మేమూ కవిత్వ మంటున్నాయి
అక్షరాలు శిల్పాన్ని వెదుక్కుంటున్నాయి.
(శ్రీశ్రీకు కృతజ్ఞతలతో...)




-సి.హెచ్. మధు
9949486122



## జై హింద్

లాఠి, తూటాలకు ఎదురొడ్డి
అహింస సత్యాగ్రహాలను ఆయుధంగా జేసి
దేశ స్వాతంత్రంకై ప్రాణాలను పణంగా పెట్టి
జైహింద్ అంటూ ఎలుగెత్తి చాటి
బ్రిటిష్ బానిస సంకెళ్ల తెంపి
స్వాతంత్రం ఫలాలు అందించిన యోధులకు వందనం
మీ పోరాటమే మాకు ఊపిరైంది
మీరు నాటిన బీజాలు భారతావనిన మొలకెత్తి
కులమతాల అడ్డుగోడలు తుంచి
ఉగ్రవాద దుశ్చర్యలను అరికడుతూ
కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు నడక సాగించి
స్వేచ్ఛా బీజాలు నాటుతూ త్రివర్ణమై తాండవిస్తుంది
మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేస్తూ
నవభారతాన సింధూరమై నిలుస్తూ
జైహింద్ అంటూ వందనం చేస్తూ
చిన్నారుల చేతిలో త్రివర్ణమై నడిచి
స్వాతంత్ర్య ఫలాలను సమర భూమికందిస్తుంది



-ఉండ్రాల రాజేశం
9966946084

## ఎన్నెన్నో!

డెబ్బైమూడేళ్లొచ్చినా
రెక్కలు రాని సీతాకోకలెన్నెన్నో
కాళ్లను చీరేస్తూ
కులాల ముళ్ళకంపలు
మానవతకు మసిపూస్తూ
మతాల ఇనుప కంచెలు
విషాలు చిమ్ముతూ
విద్వేషాగ్నులు
నడివీధుల్లో ఆంగనల
ఆక్రందనలెన్నెన్నో
మురికివాడల్లో
మగ్గుతున్న బ్రతుకులు
కొళాయి నీళ్ళు
నింపుకునే కడుపులు
మున్సిపాలిటీ పైపుల్లో
నివాసాలెన్నెన్నో!
చెత్తకుండీ పొత్తిళ్లలో
మురిగిపోయిన పసినవ్వులెన్నో
వందను అందుకోలేని
అక్షరాస్యతాశాతం

పడుతూ లేస్తూ
ఆశల్ని ఆవిరిచేసే మార్కెట్లు
అప్పులు మింగేసిన
పచ్చని జీవితాలెన్నెన్నో!
జెండానైతే ఎగరేద్దాం
జాలిచూపులకు జవాబేదీ?
సంబరాలైతే చేసుకుందాం
సామరస్య రాగాలేవీ?
వేడుకనైతే జరుపుకుందాం
వెలుగుపూల జాడేదీ?
స్వాతంత్ర్యదినోత్సవ ఉత్సాహంలో
ఉక్కిరిబిక్కిరి చేసే ప్రశ్నలెన్నెన్నో!!



- సాంబమూర్తి లండ
9642732008



## సెల్యూట్...

మానవాళిని
రక్షించు
మానవత్వం
చూపించు
సమన్వయం
పాటించు
ప్రశాంతం
కల్పించు
ఏకాగ్రతను
అలవరచుకో
అనుకున్న
గమ్యంచేరుకో

వ్యసనాలు
మానుకో
ఆరోగ్యం
కాపాడుకో
కళలను పోషించు
ధర్మాన్ని రక్షించు
కష్టాలను
అదిగమించు
కన్నవారిని
ఆదరించు
కన్న వారితో
ఆదరణ పొందు

స్వాతంత్ర్యం
పోరాటవీరుల
త్యాగాల
ప్రతిఫలం
దేశభక్తి
పెంచుకో
దేశాన్ని
రక్షించుకో

మన జెండాను ఎగురవేద్దాం
భారతమాతకు సల్యూట్ చేద్దాం



- యెల్డి సుదర్శన్ పద్మశాలి
9892411067

## ఇంకెన్నడు?

ఎన్నడు? ఇంకెన్నడు?
భారతీయుల సదాశయమ్ము
తరతరమ్ముల నిలుపు స్వాతంత్ర్యపు రోజు
అభ్యుదయపథం సమీపింపగ
జాతికి మార్గమ్ము జూపించు మంచి రోజు
ఎన్నడు.. ఇంకెన్నడు..

పాత సిద్ధాంతాలు తలెత్తకుండ
పాతిపెట్టు పవిత్రమైన రోజు
తన మతం, భాషా కానివాణ్ణి
ప్రాణమిత్రుడుగ భావించురోజు
ఎన్నడు.. ఇంకెన్నడు..


మనుషుల్లో కులమత ద్వేషాలు మాసి
వసుదైక కుటుంబముగ విలసిల్లు రోజు
ఐక్య భావమున సహజీవనము గడిపి
శాంతి సౌఖ్యములను నెలకొల్పు రోజు
ఎన్నడు.. ఇంకెన్నడు..

స్వాతంత్ర్య జయగీతి
సోషలిజం సరిగమల
తంత్రులను శ్రుతిగలిపి
గొంతెత్తి జాతి ఘనకీర్తి నాలాపించు
ఆరోజు ఇంకెన్నడు?
ఇంకెన్నడు..ఇంకెన్నడె..
ఆరోజు ఇంకెన్నడు

- కసిరెడ్డి జలంధర్‌రెడ్డి
9603499248

## మేరా జండా

మేరా భారత్ జెండా
ఎగురుతుంది ఆకాశం నిండా
గౌరవంగా బతుకాలని
గర్వంగా ఎగురుతు
సగర్వంగా చాటుతుంది ఈ జెండా!
ఘనమైన మన ఖ్యాతిని
మన కీర్తిని నలుదిసల చాటుతుంది
సమన్యాయం, సమ ధర్మం
శాంతి సౌభాగ్యాలు అందరికి
అందాలని ఆకాశంలో నిండుగ ఎగురుతుంది
త్యాగాలకు చిహ్నమై
అమరులను తలచుకుంటు
త్యాగనిరతిని ఎల్లెడెల చాటంగ
నీతినియమాలు పాటించాలని
మాన మర్యాదాలు కాపాడాలని
శాంతి కుసుమాలను వెదజల్లుతూ
గగనమే హద్దయి ఎగురుతుంది
నిరక్షరాస్యత నిర్మూలిస్తు
స్వచ్ఛ భారత్‌కై పరుగులిడుతు
మూఢాచారాల మసి బూసుతు
గట్టిగా నేలపై నిలువెత్తుగ నిలుస్తు
మత సామరస్యాన్ని కాపాడుకుంటు
ఉగ్రవాదాన్ని తరిమికొడుతు
దేశ సమైక్యతకై పాటుపడుతు
సహనముతో ఎగురుతుతుంది.



- ఎం.ఎ. గఫార్
949024834

## వందేమాతరం

వందేమాతరం నినాదంతో దద్దరిల్లింది భరతనాడు
బ్రిటిష్ సామ్రాజ్య గుండెల్లో ఫిరంగులై ఆనాడు
వందేమాతరం, వందేమాతరం.

ప్రతివ్యక్తి వీరసైన్యం, ప్రతికన్ను అగ్నిగోళం
ప్రతిమాట ఒకతూటం,
ప్రతిబాట రణరంగం
అహింసయే ఆయుధం, పొంగింది జనసంద్రం
కదిలింది ప్రవాహం , అంతమైనది ఆంగ్లరాజ్యం
వందేమాతరం, వందేమాతరం.

వేలవేల తుపాకీలు ఒడలు తూట్లు చేస్తున్నా
సైనికుల బూటుకాళ్ళు కడుపు చిదిమివేస్తున్నా
కాలిన కాగడాలు కనులు కాల్చివేస్తున్నా
కరడుకట్టిన కొరడాలు దేహంపై కదులుతున్నా

చిందలేదు కంటనీరు,పెగలలేదు ఏనోరు
వినిపించింది ఒకేమాట వందేమాతరం ప్రతినోట
వందేమాతరం, వందేమాతరం.

మనిషి మనిషి మనసులో నిలిచింది ఒకేలక్ష్యం
భరతమాత విమోచనమే అయింది అందరిధ్యేయం
ఉడుకునెత్తురు కణాలలో నిండింది ప్రతీకారం
ఒడిదొడికులకు ఎదురొడ్డి సాధించేను స్వరాజ్యం
వందేమాతరం , వందేమాతరం.

-కందాళం రజనీకృష్ణ



## నిజాలు!

ఇంటివాళ్ళే కంటగింపైతే
ఇతరుల సంగతి ఈశ్వరుడెరుగు
ఆదుకోవాలంటే ...కష్టమేమో
అడ్డుపుల్ల లెన్నైనా వేయొచ్చు అలవోకగ
కాటిదాకా ఆపవచ్చు
కాదు అనము ...కార్యం చెయ్యము
లేనప్పుడే విలువ తెల్సేది
సమయమైనా అవయవమైనా మనిషైనా
ఎక్కితే స్నేహ నౌక
ఉండదు జీవనసంద్రాన మునక

తొణకని కుండ
నిండైన స్త్రీత్వం,ఆరాధనాపాత్రం
అన్నీ పూల పోలికలే
కమలాలకు రోజాలకూ నడుమ సంపెంగ



-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## మాతృదేశపు ధూళి


ఓ భారత ధూళీ, నీ మహత్తును ఏమని అంచనావేయగలం
ప్రకృతి దయవల్ల నదులు పొంగిపొర్లుతున్నాయి
ప్రతి ఉదయమూ సూర్యుడు తన కాంతికిరణాలతో
హిమాలయ శిఖరాలను వెలిగిస్తూ ఉన్నాడు

ప్రపంచమంతటా ఆటవిక (అజ్ఞాన) మేఘాలు ఆవరించుకొని ఉన్నప్పుడు
మన భూమి (దేశం) జ్ఞాననేత్రంగా వికసించింది
ప్రాచీన స్థలాలకు గౌతముడు గౌరవాన్ని ప్రసాదించాడు
ఈ ఉద్యానాన్ని రాణా తన రక్తంతో రంగరించాడు.

ఇంటింటా ఇప్పటికీ అతని ప్రభావం ధృఢంగా ఉంది
ఇప్పటికీ అతని రక్తం మన రక్తంలో ఉరకలు వేస్తూంది
ఇప్పటికీ మేఘాలలో ఆ మెరుపు గర్జిస్తూంది
నిరుత్సాహపడిన గుండెల్లో ఉత్సాహం నింపుతూంది.

■రాణా సంగ్రామ్‌సింహ్

*కవి పరిచయం: స్వ.పండిత్ బ్రజ్‌నారాయణ్ 'చక్‌బస్త్' క్రీ.శ. 1882లో ఫైజాబాద్‌లో జన్మించారు. వీరు ప్లీడర్ ఉత్తీర్ణులయ్యారు. వీరు చురుకైన సంఘ సంస్కర్త మరియు దేశభక్తులు, రాజకీయంలో పండిత్ బిశన్ నారాయణగారి శిష్యులు. వీరి కవితల్లో దేశభక్తి నిబిడీకృతమై ఉంటుంది. ఉర్దూభాషపై వీరికి మంచి పట్టు ఉంది. వీరి ఆకస్మిక మరణం క్రీ.శ.1923లో.*



తెలుగు సేత- అమర్ జీ
9620186222
ఉర్దూ మూలం- స్వ. బ్రజ్‌నారాయణ్ 'చక్‌బస్త్'

## గుర్తింపులు

స్వాతంత్ర దినము నేడు
సంబరు కలిగె నేడు
లోటు ఉండిపోయె కొంత
భగత్సింగు కనలేదని

తోటి మనుషులకు తెలియ జెప్పె
పిచ్చిగానుందనుకుందురు
తోటి మనిషన్న భావన లేదు
తోటి వారి బాధ తెలుసుకోలేరు

ఎవరేమనుకుందురు నాకెందుకు
నేడైన-రేపైన నిల్చుండు వారి గొప్పలు
'మూల-బడనివి' వారి గొప్పలు
చెక్కు చెదరవు వారి గొప్పలు

యుగాలు మారినా
దైవముండునెల్ల కాలము
పోరాటకులంతరించినా
చెదిరిపోవు "గుర్తింపులు"



- ముమ్మడి శశిధర్ కుమార్
ఇ.నెం. 9-84/5, ప్లాట్ నెం.25
సాయినగర్, దశాపూర్
ఆదిలాబాద్-504 001

## వందనం... అభివందనం...

సమైక్యతావాదం రావాలని
సమతమమతలు వెల్లివిరియాలని
సుఖశాంతులతో నా దేశం!
సతతమూ పరిఢవిల్లాలని
మత సామరస్యత నెలకొనాలని
మానవత మూర్తీభవించాలని
ముదిత నిరంతరం పూజింపబడాలని
పిల్లలను ప్రేమిస్తూ పెద్దల్నాదరించి
గౌరవించే సమాజం కావాలని
బాలకార్మిక వ్యవస్థ సమసిపోవాలని
దారిద్ర్యమన్నది దరిదాపుల్లో కనరాకుండాలని
దైవభక్తితో పాటు
దేశభక్తిని సైతం పెంపొందించాలని
అన్నదాతగా నిలిచిన రైతన్ననే కాదు
దేశభవితనూ భద్రతనూ కాపాడే
వీర సైనికన్నను గౌరవంతో ప్రేమించాలని
కన్నతల్లి ప్రేమనే కాదు నినుగన్న

నీ మాతృభూమికి కూడా నీ ప్రేమా
భక్తి అనురాగ భావాలను పంచాలని
కడకు నా భారతం వసుధైక కుటుంబమై మెలగాలని
శాంతి ప్రేమ ధర్మాలతో
ఈ భారతమ్మ వర్ధిల్లాలని
నేను సైతం వాంఛిస్తూ విరిచిస్తూ!
మీకందిస్తున్నా
చంద్రునికో నూలు పోగు చందంగా
నేటి ఈ నా స్వతంత్ర భారతికి
వందనం.. అభివందనం

- దోసపాటి సత్యనారాయణమూర్తి
9866631817



## సం'దేశం'

అహింస నా ధర్మం
సత్యం నా వ్రతం
త్యాగం నా ఆదర్శం
శాంతి నా పథం
సమభావం నా గమశ్రీం
జనసౌఖ్యం నా గమ్యం
నీతి నా రీతి
నిజాయితీ నా ప్రకృతి
శౌర్యం నా గొప్పగుణం
స్వాభిమానం నా ప్రాణం
మర్యాద నా భావన
మంచితనం నా చేతన
శ్రమిచండం నా కర్తవ్యం
దైవానుగ్రహం నా భవితవ్యం
శరణార్థుల రక్షణ
దుర్మార్గుల శిక్షణ
నా నిసర్గ వర్తన
మోసం నా చేతగాదు
ద్వేషం నా దరికిరాదు
అపకారికి ఉపకారం నా లక్షణం
సర్వదా సహజీవనం నా విలక్షణం
సహనం నా సందేశం
భారత్ నా దేశం


- చిరమన వెంకట రమణయ్య
9441380336






సామాజిక తత్త్వవేత్త, రచయిత, సాహితీవేత్త, తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములుగారి 70వ జన్మదిన సప్తతి ఉత్సవాల సందర్భంగా 'జీవన యానం' నవలపై డా॥ యస్.రఘు రాసిన వ్యాసం...

# విభిన్న దృక్పథాల దారుల్లో జీవనయానం



-డా॥యస్.రఘు
సెల్:9848208533




తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ సామాజిక నేపథ్యాన్ని ఉద్యమ జీవితాలను వైవిధ్యంగా చిత్రించిన కథకులు బి.ఎస్.రాములు. 1982లో వచ్చిన 'బతుకుపోరు' నవల ద్వారా మహిళా బీడీ కార్మిక జీవితాలను కేంద్రంగా తీసుకుని అనేక సామాజిక అంశాలను, పరిణామాలను లోతుగా చర్చించారు బి.ఎస్. తన కథల్లో ప్రస్తావించిన విభిన్న కోణాలు ఒక ప్రధాన సంఘటన చుట్టూ లేదా సమకాలీన సమస్యను, సందర్భాన్ని ఆధారం చేసుకుని నడిపించారు. దీనికి భిన్నంగా 'జీవనయానం' నవలలో విభిన్న సామాజికవర్గాల నుండి వచ్చిన యువతీ యువకుల జీవితాలను వ్యాఖ్యానిస్తూ, వారి ఆలోచనలను, స్వభావాలను విశ్లేషిస్తూ మరొక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు. దీనికి సమాంతరంగా ఎనభైదశకం కాలపు పిల్లల తల్లిదండ్రుల దృక్పథాలను వివరించే ప్రయత్నం చేశారు. కథకంటే ముఖ్యంగా ఆయా పాత్రల ఆదర్శాలు, భావజాలాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న విభిన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య ధోరణులు పరిణామాలు ఎంతగా మనిషిని ప్రభావితం చేసే స్థాయికి వెళ్తాయనే సూచనలు ఈ నవలలో దాగి వున్నాయి. జీవనయానం నవల ఏ కొందరి జీవన గమనాన్ని తెలుపడంతోనే ఆగిపోలేదు. రేపటి ప్రపంచపు భౌతిక, తాత్విక ప్రయాణ దారులను నిర్దేశిస్తూ నడుస్తుంది. జీవనయానం నవల రచనాకాలం 1998. అయితే నవలలోని కథమాత్రం 1985-90ల మధ్య కాలంలో ప్రారంభ మవుతుంది.

జీవనయానం నవలలో ఇద్దరు కథానాయకులు. కాకపోతే అరవింద్, విక్రాంత్ పాత్రలతోపాటు లత, రాధ, అరుణ, నిర్మల పాత్రలు కథానాయికలుగా ప్రధాన కేంద్రంగా నడుస్తుంది. నవలలోని ఇతరపాత్రల జీవనపరిణామాలకు అంతే ప్రాధాన్యం ఇస్తూనే కథ ముందుకు కదులుతుంది. స్థూలంగా కథను తెలుసుకుందాం:

జీవనయానం నవల 1980వ దశకం ఆర్థిక, సామాజిక, రాజకీయ వాతావరణ నేపథ్యంలో నడుస్తుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన నలుగురు విద్యార్థులైన యువతీయువకుల జీవితాలలో వారి కుటుంబాలలో చోటు చేసుకున్న వివిధ సంఘటనలు పరిణామాల సమాహారం ఈ నవల ఇతివృత్తం. అరవింద్ చేనేత కుటుంబానికి చెందిన మెడిసిన్ విద్యార్థి. తండ్రి, తమ్ముడు వృత్తి పనికే అంకితమై అప్పులు చేస్తూ అరవింద్‌ని చదివిస్తుంటారు. అరవింద్ మేనత్త కొడుకు విక్రాంత్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిజి చేస్తుంటాడు. విక్రాంత్ తల్లి, చెల్లెలు బీడీలు చుట్టి కుటుంబాన్ని నడుపుతుంటారు. అరవింద్ తండ్రి కొడుకు మెడిసిన్ చదువుకోవటానికి అవసరమైన డబ్బు కోసం వారి కులస్తుడు, ఆర్థికంగా కలిగినవాడైన నారాయణసేటు వద్ద అప్పు చేస్తాడు. అరవింద్ ఇంటర్మీడియట్ తరువాత ఎం.సెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం ప్రయత్నిస్తున్నప్పుడు అప్పివ్వటానికి, హైదరాబాదులో పద్మశాలీ సత్రంలో గది యిప్పించటానికి అనేక సాకులు చెబుతాడు నారాయణసేటు. అరవింద్ మెడిసిన్ సీటు సాధించగానే అడగకుండానే డబ్బు అప్పివ్వటమే కాకుండా అతడి కుటుంబం పట్ల అభిమానం కనబరుస్తుంటాడు. అరవింద్ తల్లిదండ్రులు కూడా తమ కొడుకు వివాహం నారాయణసేటు కూతురు నిర్మలతో జరిగితే బాగుండునని, తమ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని భావిస్తారు. అరవింద్‌కి బాల్యం నుండి తమ ఇంటి ఆడపడుచు సక్కుబాయి కూతురు సావిత్రిని చేసుకోవాలని అనుకున్నామనే విషయం అతనికి మెడిసిన్ రాగానే తల్లిదండ్రులు విస్మరిస్తారు.

అరవింద్ కాలేజ్‌లో తన క్లాస్‌మేట్ రాధని ఇష్టపడతాడు. రాధ కూడా అతడంటే ఇష్టం చూపుతుంది. అరవింద్‌ని మరో క్లాస్‌మేట్ లత కూడా ప్రేమిస్తుంది. తన తల్లిదండ్రులు నారాయణ సేటు కూతురు గురించి చెప్పినప్పుడు అతని వలన తాము ఎదుర్కొన్న అవమానాలను గుర్తు చేస్తాడు అరవింద్. తన స్నేహితురాలు రాధను వివాహం చేసుకుంటే కూడా తాము ఆర్థికంగా బాగుండవచ్చని అంటాడు. అరవింద్ నారాయణసేటు ఇంటికి వెళ్ళినప్పుడు నిర్మలను తన తమ్ముడికి ఇచ్చి వివాహం చేయమంటాడు. సేటుకు కోపం వస్తుంది. ఆ కోపంతో నిర్మలను ఒక లెక్చరర్‌కిచ్చి చేస్తాడు నారాయణ సేటు. రాధ తండ్రి చెప్పిన సంబంధమని అమెరికాలో స్థిరపడిన డాక్టరుని వివాహ మాడుతుంది. అరవింద్ చాలా బాధపడతాడు అరవింద్ అంటే ఇష్టం చూపించిన లత, విక్రాంత్ ఆలోచనలు నచ్చి అతడిని వివాహం చేసుకుంటుంది. ఈ సంఘటనలతో కొంత అయోమయా నికి గురవుతాడు అరవింద్. అటు పిమ్మట జగిత్యాలలో హాస్పిటల్ పెట్టుకుంటాడు. అనుకోకుండా నిర్మల భర్త ఆత్మహత్య చేసుకుంటాడు. కొద్దికాలానికే అమెరికాలో రాధభర్త నల్లజాతీయుల కాల్పుల్లో చనిపోతాడు. లత, విక్రాంత్, అరవింద్‌ల సహకారంతో భర్త పోయిన దు:ఖం నుండి కోలుకున్న రాధ జగిత్యాలలో హాస్పిటల్ పెట్టుకుంటుంది. ఆమెకు తోడుగా నిర్మల అక్కడే వుండేలా చూస్తాడు అరవింద్.

నిజామాబాద్‌కి చెందిన అరుణ అరవింద్ హాస్పిటల్‌లో పిల్లల వైద్యురాలిగా చేరుతుంది. వారిరువురు పెళ్ళి చేసుకుంటే బావుంటుందని అందరు భావిస్తారు కానీ అగ్రకులస్తులమంటూ నిరాకరిస్తాడు ఆమె తండ్రి. విక్రాంత్ లెక్చరర్‌గా చేస్తూ సామాజిక ఉద్యమనేతగా సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటూ ఉంటాడు. ఎస్సీ కులానికి చెందిన లత తమ వాడలో గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలన్న తాపత్రయంతో తన సంపాదనతో తల్లికి యిల్లు కట్టిస్తుంది. అరవింద్ తన తమ్ముడికి మెడికల్ షాప్ పెట్టిస్తాడు. విక్రాంత్ చెల్లెలు మేనమరదలు సావిత్రితో తమ్ముడి పెళ్ళి జరిపిస్తాడు.

ఐదు రూపాయలకే వైద్యం చేస్తూ ప్రజాభిమానం చూరగొన్న రాధ అటు పిమ్మట రాజకీయాలలో ప్రవేశించి తొలిసారి పోటీ చేసే ఎం.ఎల్.ఏగా గెలుస్తుంది. మరోవంక అరుణ తండ్రి కూడా ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి సర్వం కోల్పోతాడు. రాధ పెళ్ళి క్లాసుమేట్, డైవర్సీ అయిన రాజేశ్వర్‌తో ఘనంగా జరుగుతుంది. అరవింద్‌తో అరుణ వివాహం, విదేశాల నుండి వచ్చిన డైవోర్సీతో నిర్మల వివాహం జరగటంతో నవల ముగుస్తుంది.

జీవనయానం నవల మధ్యతరగతి మనుషులు, వారి జీవితాలు కేంద్రంగా పరిభ్రమిస్తున్నట్టుగా కనిపిస్తుంది సమకాలీన ప్రాపంచిక పరిణామాల చుట్టూ విస్తృతంగా చర్చలను లేవనెత్తుతుంది. ఇదివరకటి తెలంగాణ నవలల్లో ఉద్యమచిత్రణ ఎక్కువగా వుంటూ జీవిత ప్రస్తావన నామమాత్రంగా ప్రస్తావించబడేది. ఈ నవలలో మాత్రం పాత్రల అవసరాలు, ఆలోచనలు, జీవనస్థితిగతుల మధ్య సామాజిక ఉద్యమాలు, వాదాలకు సంబంధించిన అంశాలు చర్చాత్మకమయ్యాయి. వైయక్తికజీవితం, సామాజికం రెండూ వేటికవే ప్రాధాన్యం సంతరించుకునేలా నైపుణ్యంతో నవలను మలచారు బి.ఎస్. రాములు. ఈ నవలను మూడు విభాగాలుగా వర్గీకరించుకుని ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు ఆ విభాగాలను విశ్లేషించుకోవచ్చు. విభిన్న కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత ఇష్టాలు, అభిప్రాయాలు, లక్ష్యాలు గల పాత్రల పయనం ఒకవైపు ఈ నవలలో చిత్రితమైంది. మరోవైపు స్థానిక సామాజిక రాజకీయ వాతావరణం, వాదనలు, చర్చలతో సమాజంలో నెలకొన్న అనేక ధోరణులను పరిచయం చేయడం కనిపిస్తుంది. ముఖ్యమైన మూడవకోణం రచయిత

**తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ సామాజిక నేపథ్యాన్ని ఉద్యమ జీవితాలను వైవిధ్యంగా చిత్రించిన కథకులు బి.ఎస్.రాములు.**

దృక్పథం. ఈ దృక్పథ భావజాలంలోంచే మనిషి జాతీయ, అంతర్జాతీయస్థాయికి తన జ్ఞానపరిధిని, తాత్విక సైద్ధాంతిక విస్తృతిని పెంచుకోవాలనే చైతన్యాన్ని ప్రబోధిస్తారు. బి.ఎస్. రాములు. తనలో సుడులురేగే చింతనాత్మక ఆలోచలనలకు అనుగుణంగా పాత్రలు మలచుకున్నారు. ఆయా పాత్రల ద్వారా చిక్కుముడులను విప్పుకుంటూ లోకానికి సమాధానాలు అందించే ప్రయత్నం చేసారు. జీవనయానం నవలలో అలాంటి అంశాలను, సందర్భాలను స్థూలంగా వివేచన చేద్దాం.

'జీవనయానం' లోని ముఖ్యపాత్రలన్ని నవయవ్వనప్రాయంతో ప్రేమపూరిత భావనలను నింపుకున్న వారే. నవల కూడా అరవింద్ రాధల మధ్య చిగురిస్తున్న ప్రేమను తెలుపుతూనే ఆరంభమవుతుంది. ప్రెస్‌క్లబ్‌లో సామాజిక అర్థశాస్త్రవేత్త ప్రసంగం వినాలనే నెపంతో రాధను కల్సుకోవడానికి ఇదొక మంచి ప్రదేశంగా అరవింద్ భావిస్తాడు. ఆ తర్వాత ఇద్దరు కలిసి సినిమాకు వెళ్తారు. సినిమా చూస్తూ కళ్ళతో హృదయాలు కలుపుకున్న ఉత్తేజం, చేతుల్లో వేళ్లు బిగించి, కాళ్ళతో కాళ్ళు తాకించి అనుభవించిన స్పర్శాసుఖంతో అందరి ప్రేమల్లానే, ప్రేమికుల్లానే అరవింద్, రాధలు పరిచయమవుతారు. రచయిత సాధారణ ప్రేమకథా దారిలోంచి ఒక్కసారిగా అనేక మలుపులను తిప్పుతాడు. యువతీ యువకులు, వారి తల్లిదండ్రులు ప్రేమ, వివాహ సంబంధాల గురించి ఏ విధంగా ఆలోచిస్తారు, తమ నిర్ణయాలను ఎలా మార్చుకుంటారనే విషయాలపై వాస్తవిక సన్నివేశాలను రచయిత సృష్టించాడు. అరవింద్‌కు మెడిసిన్‌లో సీటురానప్పుడు అతని తల్లిదండ్రులు తమ బంధువైన బీడికార్మికురాలు సక్కుబాయి కూతురు సావిత్రితో పెళ్ళి చేయాలని అనుకుంటారు. అరవింద్‌కు డాక్టర్ సీటు వచ్చిందగ్గర్నుంచి అరవింద్ తల్లిదండ్రులు దేవక్క చంద్రయ్య ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది. తమను వెంటాడుతున్న పేదరికం నుండి తొందరగా బయటపడాలనే ఆశ పెరిగిపోయింది. అది కొడుకు పెళ్ళిరూపంలో కలిసివచ్చే అదృష్టంగా భావిస్తారు. ధనవంతుడైన నారాయణసేటు కూతురు నిర్మలను చేసుకుంటే ఐశ్వర్యంతోబాటు, ఊళ్ళో తమ ప్రతిష్ట పెరుగుతుందని ఉత్సాహపడుతారు. నారాయణసేటు కూడా అరవింద్‌ను అల్లునిగా చేసుకోవడానికి ఆత్రుతపడుతుంటాడు.

అరవింద్ మాత్రం ఈ సంబంధానికి విముఖంగా వుంటాడు. ఇందుకు రెండు కారణాలున్నాయి. మొదటిది మెడికో రాధను ప్రేమిస్తుండడం. రెండవది నారాయణసేటు మనస్తత్వం నచ్చకపోవడం. ఇంటర్ తర్వాత ఎం.సెట్ కోచింగ్‌కు, పద్మశాలి హాస్టల్‌లో సీటుకోసం సహాయం చేయమని నారాయణసేటుని అరవింద్ తండ్రి బతిమిలాడాడు. నారాయణ సహాయం చేయకపోగా 'ఎంసెట్ చదివించడం నీవల్లకాదు' అని వేళాకోళమాడుతూ నిరుత్సాహపరిచాడు. అప్పుడు అరవింద్ బి.ఎస్.సిలో జాయినై బట్టలునేస్తూ ఇంటివద్దే ఎం.సెట్‌కు ప్రిపేరయ్యాడు. అయినా నారాయణసేటు దగ్గర మూడువేలు అప్పు చేయాల్సి వచ్చింది. తనకు మెడిసిన్లో సీటువచ్చాక నారాయణసేటు తమపట్ల మర్యాద చూపించడం వెనకున్న స్వార్థాన్ని పసిగట్టాడు. అందుకే నారాయణ కూతురు నిర్మలతో సంబంధాన్ని తిరస్కరించాడు. మరోవైపు రాధ వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసర్, నారాయణసేటు కన్న ఎక్కువే ఇస్తాడు. పైగా రాధకూడా డాక్టర్‌కోర్స్ చదువుతుందనే బలమైన అంశాలను తల్లిదండ్రులకు చెప్పి రాధతో పెళ్ళికి అరవింద్ ఒప్పిస్తాడు. వారిని సంతృప్తి పరుస్తాడు. అరవింద్ ఈ విషయాన్ని సంతోషంగా రాధకు చెబుతాడు. రాధ ఊహించని సమాధానాన్ని చెబుతుంది. 'స్టేట్స్‌లో ఎం.ఎస్ కార్డియాలజిస్ట్ వి.ఎల్. కాంట్‌తో నా పెళ్ళి కుదిరింది. నా పెళ్ళికి నీవు తప్పకుండా రావాలి' అన్నమాటలతో అరవింద్ నిర్ఘాంతపోతాడు. భగ్నహృదయంతో తీవ్ర నిరాశ, దు:ఖంలో మునిగిపోతాడు.

ఇక్కడ సావిత్రిది కూడా అదే పరిస్థితి. చిన్నప్పటినుంచి అరవింద్ మీద ప్రేమను పెంచుకుంది. బావ మరదళ్ళుగా వరసైన సంబంధమని అందరూ అనుకుంటున్నారు. బావను చేసుకునే అర్హత లేకపోవడం, తను తిరస్కరించడమనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక వెక్కివెక్కి ఏడ్చింది. కొన్ని రోజులపాటు తిండితినక చిక్కిపోయింది. సావిత్రి బాధను చూసిన దేవక్కకు కడుపు తరుక్కుపోయింది. చిన్నకొడుకు ఆనంద్‌కు సావిత్రిని ఇచ్చి చేద్దాం అనే ఆలోచన చేసింది. అరవింద్ మాత్రం సావిత్రిలోని ఆవేదనను అర్థం చేసుకోలేని స్థితిలో వుంటాడు.

అరవింద్ రాధల క్లాస్‌మేట్ లత మొదటినుంచి అరవింద్‌ను ఇష్టపడుతుంది. అరవింద్‌కు ఈ విషయం తెలుసు కాబట్టి ఎప్పుడు లతకు దూరంగా వుండడానికి ప్రయత్నిస్తాడు. తన మిత్రుడైన విక్రాంత్ ద్వారా అరవింద్ ఇంటి విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వుంటుంది లత. అరవింద్ కుటుంబ పరిస్థితులు తమ పేదరికం ఒకే తీరుగా వుండటంవల్ల అరవింద్‌కు దగ్గరవ్వాలని నిరంతరం ప్రయత్నం చేస్తుంది. అరవింద్ లతకు తనమీదున్న గాఢమైన ఇష్టాన్ని, ప్రేమను గురించి క్షణమాత్రమైనా ఆలోచించలేదు. రాధ దూరమైపోతుందన్న బాధతో అరవింద్ కన్నీటి పర్యంతమైపోతుంటాడు. బంధువు విక్రాంత్ ఈ విషయమై ఆరా తీసినప్పుడు 'రాధ యిలా చేస్తుందని ఏ కాస్త అనుమానం వున్నా నిర్మలను చేసుకునేవాడిని. నాకు ఎంతో ఆధారం ఉండేది' అంటాడు అరవింద్. రచయిత ఇక్కడ అరవింద్ స్వభావాన్నేకాదు సగటు యువకుల ప్రేమ తీవ్రతలోని స్థాయిని వివరిస్తున్నాడు. ఇక్కడ ప్రేమకంటే కూడా ఆస్తి, అంతస్థుల ద్వారా సంక్రమించే ఉన్నత జీవన స్థితిగతులను ఆశీస్తున్నారనే సమీకరణాలు అర్థమవుతాయి. విక్రాంత్ మాటల ద్వారా రచయిత నేటి యువతరం ఆలోచనలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాడు.

విక్రాంత్ మాటలు అరవింద్‌లో అనేక ప్రశ్నలను రేకేత్తిస్తాయి. "ఎవరైనా ఉన్నస్థితి నుంచి మరింత ఉన్నత జీవితం గెలుచుకోవాలనుకుంటారు. రాధకూడా అలాగే ఆలోచించింది. రాధ తనను నిరాకరించి మరొకర్ని పెళ్ళి చేసుకోబోతున్న విషయం ప్రపంచం మునిగిపోయే సమస్యగా కనిపించింది. తాను నిరాకరించడం వల్ల సావిత్రి కన్న కలలు కూడా ఇలాగే చెదిరిపోయాయి కదా? రాధ పట్ల తనది రెండుహోదాల మధ్య ప్రేమేనా? మరదలు సావిత్రి ప్రేమను తాను అందుకే అంత తేలిగ్గా తీసేశాడా? రాధకూడా యిందుకే తన ప్రేమని అంత తేలిగ్గా తీసేసిందా?

రాధకోసం తాను బాధపడ్తున్నట్టే తనకోసం లత బాధపడింది. తమ యిద్దరి బాధకన్నా సావిత్రి దు:ఖం ఎంతో ఎక్కువ. తన కోసం సావిత్రి ఎంత బాధపడిందో. అమ్మానాన్నలు పెద్దసేటు అయిన నారాయణ మామ కూతురు నిర్మలను పెళ్ళి చేసుకొమ్మని అడిగారే గానీ మేనమరదలు వరసైనా సావిత్రి ఊసే ఎందుకు తీయలేదు. అత్త బీడీలు చేస్తుందనే గదా! తనకు డాక్టరమ్మాయే కావాలంటే దొరక్కపోదు. లత ఉంది. కాని సావిత్రికి డాక్టరు భర్త దొరుకుతాడా? ఈ ప్రశ్నలన్ని అరవింద్ పాత్రవికావు. అరవింద్ పాత్రద్వారా రచయిత నేటి యువతీయువకుల స్వభావాలను, దృక్పథాలను నిక్కచ్చిగా చూపించే పనికి పూనుకున్నాడు.


అరవింద్ నారాయణసేటు దగ్గరికి వెళ్ళినప్పుడు నిర్మలను నిరాకరిస్తూ, నిర్మలను తమ్ముడు ఆనంద్‌కిచ్చి చేస్తే ఎట్లుంటుందనే ప్రతిపాదన చేస్తాడు. ఇక్కడ కూడా నిర్మల తనకు వద్దంటూ నిర్మల ద్వారా వచ్చే ఉన్నత ఆర్థిక స్థాయి తమ కుటుంబానికే దక్కాలనే ఆలోచన చేస్తాడు. అరవింద్ ఈ బాధలు, ఆలోచలనల మధ్య సావిత్రి ఇంటికి పోతాడు. బీడీలు చేస్తున్న సావిత్రిని చూసి 'ఎంత అందంగా ఉంది రాధ, నిర్మల, లత కన్నా సావిత్రే ఎంతో బావుంది. తాను రాధను ప్రేమించి పొరపాటు చేశానా' అని అనుకుంటాడు. నేటి యువతరం ఆలోచనల్లోని గందరగోళాన్ని, ఒక స్థిరమైన నిర్ణయాన్ని తీసుకోలేని అస్థిరమనస్తత్వాలకు, ఊగిసలాట ధోరణులకు బలమైన ప్రతినిధిగా అరవింద్ కనిపిస్తాడు.

అరవింద్ కొన్ని సందర్భాలలో వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకుంటాడు. 'తనలాంటి వాళ్ళకు అటుపూర్తి పైస్థాయి రాధతోనూ పెళ్ళి వీలుకాలేదు. ఇటు పూర్తిగా కింది స్థాయి సావిత్రితోనూ పెళ్ళికాలేని స్థితి' ని గుర్తిస్తాడు. పెళ్ళికి మనిషి వ్యక్తిగత ఇష్టాఇష్టాల ప్రమేయంలేదా' అని ప్రశ్నించుకుంటాడు. రాధ, సావిత్రులతో వీలుకాని బంధం తనను ఎంతగానో ప్రేమించే లత ద్వారా పొందవచ్చు అని సంతృప్తిపడతాడు.

కాలక్రమంలో లతకూడా అరవింద్‌కు దూరమయింది. లతకు తన ఇష్టాన్ని తెలియజేయడంలో ఆలస్యం చేశానా అని మధనపడిపోయాడు. ఎవరూ తన ప్రమేయం లేకుండానే తనకు దూరమైపోతున్నారని ఎవరికీ చెప్పుకోలేని వేధనకు గురయ్యాడు. ఎన్నో రాత్రులు బాధపడిన అరవింద్ నెమ్మదిగా మామూలు మనిషైపోతాడు. కొన్నాళ్ళకు అరవింద్ జగిత్యాలలో హాస్పిటల్ ఓపెన్ చేశాడు. చిల్డ్రన్ స్పెషలిస్ట్‌గా చేరిన అరుణకు అరవింద్ కుటుంబంతో సాన్నిహిత్యం ఏర్పడింది. అనేక అవాంతరాల మధ్య చివరకు అగ్రకులానికి చెందిన అరుణను అరవింద్ మీటింగ్ పద్ధతిలో పెళ్ళి చేసుకున్నాడు. ఈ అరవింద్ జీవనయానంలోంచి రచయిత ప్రేమ-పెళ్ళికి సంబంధించిన విభిన్న ఆలోచనలు, అంతర్మథనాలు, సంఘర్షణల్ని చిత్రించాడు. మనసులోని మాటలను ధైర్యంగా వ్యక్తపరచలేని నిస్సహాయతవల్ల చేకూరే నష్టాలను ఒకవైపు చూపించాడు. మరోవైపు ఊహించని నిరాశలకు కృంగిపోకుండా సంయమనంతో వ్యవహరించడంవల్ల ఒక దశలో జీవితం కుదుటపడుతుందనే సత్యాన్ని ధృవీకరిస్తుంది అరవింద్ పాత్ర. నేటి యువతరానికి వుండవలసిన సహన నైపుణ్యాలను అన్ని పాత్రల ద్వారా చూపించే ప్రయత్నం చేసారు బి.ఎస్. రాములు.

ఈ నవలలో అరవింద్ క్లాస్‌మేట్ లత మరో ముఖ్యపాత్ర. అరవింద్‌ను గాఢంగా ప్రేమించింది. అరవింద్‌ను రాధ నిరాకరించాక ఒక సందర్భంలో 'అరవింద్! మనం ప్రేమించేవారికన్నా మనను ప్రేమించే వారితో పెళ్ళి జరిగితే జీవితం ఆనందమయమవుతుందటారు. నీ అభిప్రాయం ఏమిటి?" అని ధైర్యంగా అడిగింది. అరవింద్ అంతరంగాన్ని అర్థం చేసుకోవటానికి అనేక విధాలుగా మాట్లాడింది. "నిన్ను ప్రేమించే నన్ను చేసుకుంటే నీ జీవితం ఆనందమయ మవుతుంది. కాని నన్ను ప్రేమించేవారితో నా పెళ్ళి జరిగితే నాకు ఆనందంగా ఉంటుంది గదా" అని ఉడికించింది. ఇలా ఉడికింపుగా మాట్లాడినవే ఆచరణ రూపంలోకి వచ్చాయి. సెలవుల్లో లత అరవింద్, విక్రాంత్‌ల ఊరైన జగిత్యాలలో వాళ్ళ ఇంటికి వచ్చింది. వారి కుటుంబ సభ్యులతో రెండురోజులు గడిపాక లత ఒక విషయాన్ని అర్థం చేసుకుంది. అరవింద్‌ను, అరవింద్ కుటుంబాన్ని, విక్రాంత్‌ను, విక్రాంత్ తల్లిని, చెల్లెలు సావిత్రిని చూసిన తర్వాత తన సంస్కృతి, పెరిగిన జీవితం అచ్చం విక్రాంత్ కుటుంబంలాగే ఉందనుకుంటుంది.

**'జీవనయానం' నవలలో విభిన్న సామాజికవర్గాల నుండి వచ్చిన యువతీ యువకుల జీవితాలను వ్యాఖ్యానిస్తూ, వారి ఆలోచనలను, స్వభావాలను విశ్లేషిస్తూ మరొక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు.**



భారత రాష్ట్రపతి గౌ॥ రామ్‌నాథ్ కోవింద్‌తో

అంతేకాదు స్పష్టంగా, నిర్మొహమాటంగా అరవింద్‌తో 'విక్రాంత్ వాళ్ళ అమ్మనూ, సావిత్రినీ చూస్తుంటే అది మా యిల్లులాగే ఉంది. నా సోషల్ బ్యాగ్రౌండ్‌కు, నా అభిరుచులకు విక్రాంత్ మంచి మ్యాచ్ అన్పిస్తోంది" అని సాభిప్రాయంగా ప్రకటించింది. రచయిత లత పాత్ర ద్వారా ఒక సామాజిక పరిశీలనను చేయదలచుకున్నాడు. మాదిగ కులానికి చెందిన లత పాత్ర చేసే ఆలోచనలు ఆయా సామాజిక వర్గస్వభావాలను, సంఘర్షణను తెలియజేస్తాయి. లత తల్లి ప్రభుత్వ సఫాయి కార్మికురాలు. అన్న గవర్నమెంట్ స్కూల్లో అటెండర్ ఉద్యోగం. అరవింద్, విక్రాంత్‌లకన్నా తమ కుటుంబమే కాస్త మెరుగు అని అర్థం చేసుకుంది. కానీ వాళ్ళది పెద్ద కులం, తమది చిన్న కులం అని సమాజం గీసుకున్న రేఖల మధ్య సంశయంగా ఆగిపోయింది. తన అన్నమీద స్కూల్లో దొంగతనం చేసాడనే అనుమానంతో పోలీసులతో కొట్టించారనే వివాదం సందర్భంలో లత తీవ్రంగానే వాదిస్తుంది. "ఎస్సీలమని అందరికీ చిన్నచూపే, మేం కూడా మనుషులమే. మా అన్న అమాయకుడు. మీకు ఇంటికాడ, స్కూళ్లో ఇన్ని సేవలు చేస్తే మా అన్నకు ఇదా మీరిచ్చే మర్యాద" అంటూ స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక్కడ విక్రాంత్ అండగా నిలబడటం, బలంగా ఎస్సీలకు అనుకూలంగా వాదనలు వినిపించడం వల్ల లతకు ఈ ధైర్యం వచ్చింది. నిజానికి లత కూడా తమ కులం గురించిన ఆత్మన్యూనత భావాన్ని అధిగమించలేకపోయింది. లత రాధ పెళ్ళికి తోడుగా వాళ్ళింట్లో వున్నప్పుడు ఈ విషయం బయటపడుతుంది. పెద్దకులమనుకునే రాధ ఇంటికి వచ్చిన బంధుమిత్రులను చూస్తుంటే లతలో ఇన్ఫిరియార్టీ మొదలవుతుంది. వారి మధ్యనుంటే శ్వాస ఆడనట్టు, వారి భారీ ఏర్పాట్లు, మాటలు తన స్థితిని ప్రతీక్షణం గుర్తు చేస్తున్నట్టుగా ఫీలయింది. డాక్టర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టాక తమ ఊరిలో అమ్మ ఉంటున్న గుడిసె, రేకుల షెడ్డును తీసేయించి డాబా ఇల్లు కట్టించింది. ఆ విధంగా ఎస్సీ అనే భావం నుంచి తాము కూడా ఎదిగాము అనే భావం ఊళ్ళోవాళ్ళకు కలిగించి ఆత్మగౌరవం ప్రకటించుకునే ప్రయత్నం చేసింది. జీవితంలో ఎదగాలనే ప్రయత్నంలో తప్పులేదు కాని, తాము ఎస్సీననే భావనను పదేపదే గుర్తు చేసుకోవడం ద్వారా సమకాలీన ఎస్సీకులంలోని కొందరి మనస్తత్వాన్ని, అస్తిత్వ సంఘర్షణను యధాతథంగా చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది.

బి.ఎస్. రాములు గారి విస్తృతమైన లోకానుభవం, లోతైన జీవన పరిశీలన, నిశితంగా మానవ స్వభావాల విశ్లేషణ, అనేక సాహిత్య, ఉద్యమ భావజాలాలు, వాదాల అధ్యయనం పునాదిగా జీవనయానం నవల వేగంగా పరుగులు పెడుతుంది. ఈ నవలలో అనేక పాత్రలు అడుగడుగునా పలకరిస్తాయి. ఆయా పాత్రల ఆలోచనలు ద్వారా మనుషులలో ఉండే సాధారణ సహజ స్వభావాలను, లోకరీతిని మనకు విప్పిచెప్పే ప్రయత్నం చేసాడు రచయిత. అరవింద్ తల్లి దేవక్క స్వభావాన్ని చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. నారాయణ సేటు కూతురు నిర్మలను పెద్దకొడుకు అరవింద్ నిరాకరించడంతో నిరాశపడుతుంది దేవక్క. ఆ తర్వాత అరవింద్ పెద్ద ఆఫీసర్ కూతురైన రాధను చేసుకుంటున్నాడు కదా అనే సంతృప్తి పడుతుంది. అక్కడితో ఆగకుండా ఇంటర్‌ఫెయిలై గుమస్తాగా ఉద్యోగం చేస్తున్న చిన్నకొడుకు ఆనంద్‌కు నిర్మలనిచ్చి పెళ్ళిచేస్తే బాగుండు అని మరింత ఆశపడుతుంది. అది జరగకపోయేసరికి సావిత్రినిచ్చి చేయాలనుకుంటుంది. విక్రాంత్ డాక్టర్‌లతను పెళ్ళిచేసుకున్నప్పుడు లత తన కోడలుగా వచ్చివుంటే ఎంతమంచిగుండు అనుకుంటుంది. అన్నీ అనుకున్నట్లుకావు. విక్రాంత్‌ను చేసుకొని సక్కుబాయి ఇంట్లపడితే మన ఇంటపడ్డట్టే అని తృప్తిపడుతుంది దేవక్క. సగటు స్త్రీల సహజ మనస్తత్వాన్ని పట్టుకుంటాడు రచయిత.

కాలక్రమంలో నిర్మల భర్త ఆత్మహత్య చేసుకోవడం, తండ్రి నారాయణ సేటు చనిపోవడం, అన్న శ్రీనివాస్ ఆర్థికంగా దివాలా తీయడం చూసి 'పాపం నిర్మల దిక్కులేనిదైపోయే' అని దేవక్క బాధపడుతుంది. వీరందరికి దగ్గరి బంధువైన సక్కుబాయి మాత్రం ఈసడింపుగా 'ఎందుకు పాపం అనాలె వదినే? చేసిన పాపం ఉత్తగనే పోతాదా. మమ్ముల ముంచె, మందిని ముంచె, కులాన్ని ముంచె, కుల సంగాన్ని ముంచె. అందర్ని ముంచి తానొక్కడు మీదికి తేలితే ఆ గోస తాకదా! నా ఉసురు తలుగదా? నిర్మలకేమైనా నీలుగుడు తక్కువుండెనా? అది ఎన్నడన్న నన్ను చిన్నీ అని పిలిసిందా!" అని ఇన్నాళ్ళు తన కడుపులో దాచుకున్న అక్కసునంతా వెళ్ళగక్కింది. ఇక్కడ సక్కుబాయి మాటలు సగటు బంధువుల మధ్యనుండే సమస్యలు, పగలు, ప్రతీకారాలు అసూయల వల్ల వచ్చినవే. తమకు అనుకూల సమయం వచ్చినప్పుడు వారికి వ్యతిరేకంగా మాట్లాడి ఒక విధమైన మానసిక ఆనందాన్ని పొందుతారు. ఇటువంటి సమయంలో మనకు ఏమీ కానివారే సహాయాన్ని, సానుభూతిని అందిస్తారు. నిర్మల విషయంలోనూ అదే జరుగుతుంది. ఇదే నిర్మల తన తండ్రి నారాయణ బతికున్నప్పుడు అరవింద్ కుటుంబం గురించి ఏమాత్రం ఆలోచించలేదు. అరవింద్ తనకు వరసకు మేనబావ అవుతాడనే విషయాన్ని కలలోకూడా నిర్మల సహించలేకపోయింది. నాన్న చేతికింద, తమ చేతి కింద పనిచేసే పనిమనుషులు, కూలివాళ్ళు అన్నట్లుగా చూసింది. చివరకు అరవింద్, రాధ ద్వారే ఆమె జీవితం కుదుటపడుతుంది. విధి చేసే విచిత్రాలను చూపుతాడు రచయిత.

నిర్మల జీవితం ద్వారా కూడా రచయిత లోకతీరును వివరిస్తాడు. తండ్రి నారాయణసేటు బతికున్నప్పుడు నిర్మల గారాబంగా పెరిగింది. కష్టం అనేది తెలియదు. పేదరికం అంటే ఒక విధమైన ఏవగింపు వుండేది. తండ్రి చనిపోయాక నిర్మల జీవితంలో అసలు కష్టాలు మొదలయ్యాయి. భర్త చనిపోయినప్పుడు కూడా ఇంత కష్టంగా రోజులు గడవలేదు. ఇప్పుడు నిర్మల వదిన యింట్లో పనిమనిషిలా అయిపోయింది. వదిన తన సొమ్మంతా

(మిగతా 5వ పేజీలో...)




'జీవనయానం' నవల ఆవిష్కరణలో...



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బి.యస్.రాములు కుటుంబ సభ్యులు....

(5వ పేజీ తరువాయి...)

తిన్నట్టుగా బాధపడ్తుంది. ఈసడించు కుంటుంది. అందుకే తన బతుకుగురించి తాను ఆలోచించడం మొదలుపెట్టవలసి వచ్చింది. ఏదోఒక పని చేసుకుని బతకాలి అని నిర్ణయించుకుని ఒక ప్రైవేటు స్కూల్లో ఉద్యోగానికి కుదురుకుంది. జీవితమంటే, మనుషులంటే ఏమిటో అప్పుడు తెలిసివచ్చింది నిర్మలకు. బి.ఎస్.రాములు గమనించిన జీవితాల నుండే ఈ పాత్రలు ఆవిర్భవించాయి. ఇటువంటి పాత్రలు, సంఘటనలు పునరావృతం కావడాన్ని కూడా మనం గమనించవచ్చు.

లెక్చరర్‌గా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న విక్రాంత్ డాక్టర్ లతను పెళ్ళి చేసుకున్నప్పుడు కూడా సమాజం ఏవిధంగా స్పందిస్తుందో ఈ నవల పట్టి చూపిస్తుంది. సఫాయి కార్మికురాలైన లత తల్లి కూడా విక్రాంత్‌తో కూతురు పెళ్ళి గురించి ఆందోళన చెందుతుంది. డాక్టర్ పిల్లవాడైతే బాగుండేదని అనుకుంటుంది. ఏ సంబంధంలేని ఇరుగుపొరుగు బంధుమిత్రులు కొందరు 'ఏమీలేని పిల్లగానికి డాక్టర్ పిల్ల దొరికింది అని ఈర్ష్యపడ్డారు. కులం తక్కువ పిల్లను చేసుకున్నాడని కొందరు చెవులు కొరుక్కున్నారు. ఆ డాక్టర్ పిల్ల తల్లి సఫాయి పని చేస్తదట. అన్న చెప్రాసి అట. వాళ్ళకు ఇంతకన్నా మంచి సంబంధం దొరుకుతుందా అని మరికొందరు ముచ్చటించుకున్నారు. అలా కులాలవారీగా, వారు అర్థం చేసుకున్న తీరుగా వారి వారి సంస్కార స్థాయిలో కులాంతరవివాహాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించుకున్నారు. ఈ వ్యాఖ్యానాలన్నీ రచయిత ఊహలనుండి ఉద్భవించినవి కావు. మనుషుల ఆలోచనల్లోని స్థాయిని, వారి దృక్పథాల తీరుని, కాలం తెస్తున్న పరిణామాలను అర్థం చేసుకోలేని, ఆమోదించలేని వైఖరులకు నిదర్శనంగా వీటిని స్వీకరించవచ్చు.

బ్రాహ్మణ యువతి డాక్టర్ అరుణ బి.సి. కులానికి చెందిన అరవింద్‌ను పెళ్ళి చేసుకునే ఆలోచన చేస్తుందని తండ్రి దయాకర్‌రావుకు తెలిసి అనేక విధాలుగా ఆలోచిస్తాడు. చివరకు ఒప్పుకుని ఎందుకైనా మంచిదని తెలిసినవారిద్వారా అరవింద్ గురించి ఆరా తీస్తాడు. అరవింద్ గురించి రకరకాల మాటలు వినబడ్డాయి. ఏవో అక్రమ సంబంధాలు, అనేక లవ్‌ఎఫైర్లు ఏవో ఉన్నాయని రాధ, లత, సావిత్రి పేర్లతో ముడిపడి వినిపిస్తాయి. ఇవేవి వారు మాట్లాడుకున్నంత తీవ్ర వాస్తవాలు కావు. అట్టడుగు స్థానం నుండి ఉన్నతస్థాయికి ఎదిగే క్రమంలోని వారిపై అనేక అభాండాలు వేసేవారు ఉంటారు. వైద్యం వ్యాపారస్థాయికి పెరిగి వృత్తిపరమైన పోటీ ఏర్పడ్డప్పుడు పక్కనున్నవారే మనం క్యారెక్టర్‌ను నీచంగా దిగజార్చే ప్రయత్నం చేస్తారనడానికి అరవింద్ మీద వచ్చిన విమర్శలు ఉదాహరణంగా చూపించవచ్చు. ఎంత ఉన్నతమైన చదువులు చదువుకున్నవారైనా సంపాదనలో పోటీ వచ్చినప్పుడు ఎదుటివాడిని ఏ విధంగానైనా దెబ్బతీయాలనే మనిషి కుత్సితపు కుట్ర మనస్తత్వాన్ని విప్పి చెబుతాడు రచయిత.

జీవనయానం నవల కులాలకు సంబంధించిన అనేక విషయాలను విస్తృతంగా చర్చించింది. రచయిత బి.సి కులానికి చెందిన పద్మశాలి కుటుంబనేపథ్యంలోంచి వచ్చినందువల్ల పద్మశాలి జీవన నేపథ్యంలోంచి ఈ కథ మొదలవుతుంది. ఈ నవలలోని ప్రధాన పాత్రలనుకునే అరవింద్, విక్రాంత్‌లు పద్మశాలి కుటుంబానికి చెందినవారు కావడంవల్ల ఆ కులానికి సంబంధించిన అనేక విషయాలు సందర్భోచితంగా ప్రస్తావనకు వచ్చాయి. అరవింద్ తండ్రి మగ్గం నేసుడు పని ద్వారానే కుటుంబాన్ని నడుపుతుంటాడు. చాలా కష్టపడుతూ, అప్పులు చేస్తూ కొడుకు అరవింద్‌ను డాక్టర్‌కోర్స్ చదివిస్తుంటాడు. కాలం గడుస్తున్న కొద్దీ శారీరకంగా బలహీనుడవుతూ అనారోగ్యంతో బాధపడుతూనే కుటుంబాన్ని పోషించే ప్రయత్నం చేస్తుంటాడు. విక్రాంత్‌కు తండ్రిలేడు. తల్లి, చెల్లెలు సావిత్రి బీడీలు చేస్తూ క్యాంపస్‌లో పీజి చదువుకునేలా ప్రోత్సహిస్తుంటారు. అరవింద్, విక్రాంత్‌ల ఇద్దరికి తమ సామాజిక నేపథ్యమూ, ఆర్థికస్థాయి తెలుసు, ఆ స్పృహ, చైతన్యంతోనే ఈ పాత్రలను వాస్తవికంగా, సహజంగా ప్రవర్తించేటట్లుగా మలచారు బి.ఎస్. రాములు.

జీవనయానం నవల పద్మశాలీల సామాజిక వర్గం గొప్పదనాన్ని చరిత్రను అరవింద్ పాత్ర ద్వారా ఈ విధంగా వివరిస్తుంది. "మా తాత అంటే మా తల్లి తండ్రి గొప్ప ఆయుర్వేదవైద్యుడు. నిజాం రాష్ట్రంలో యాభై ఏళ్ళక్రితం దాకా ఏడువేలమంది ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్.యం.పి ఆయుర్వేద వైద్యుల్లో ఆరువేలమంది పద్మశాలీలే. అలోపతి వైద్యం ప్రాచుర్యంలోకి రావడంతో వాళ్ళ ప్రాక్టీసు పడిపోయింది. బతుకు చితికిపోయింది. అందులో మా తాత కుటుంబం ఒకటి. బట్టల మిల్లులొచ్చి పద్మశాలీల కులవృత్తిని దెబ్బతీసాయి. బతుకుదెరువు కరువైంది. అలోపతి వచ్చి దెబ్బతీసింది కూడా పద్మశాలీల బతుకుల్నే. వాళ్ళ బతుకులు శిథిలమై మన బతుకులు బాగుపడుతున్నాయి. మన పూర్వీకుల వారసత్వ వైద్య సంపదను వెలికితీసి తిరిగి ప్రజల పరం చేయాలన్నదే నా సెంటిమెంట్". ఈ విషయాలన్నీ చెప్పడంలో రచయిత ప్రయోజనాలకంటే కూడా ఆయా సామాజిక వర్గాల కులప్రీతి, వైయక్తిక ఇష్టాలు, పరిణామక్రమంలోని ఉత్థానపతనాలను అందరికి వెల్లడిచేయలనే తపన, ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే పద్మశాలీలలో నారాయణసేటు గురించి కూడా నిక్కచ్చిగా ఇలా వివరిస్తాడు 'నారాయణసేటు మొదట్లో చేనేత సహకార సంఘంలో బాగానే పనిచేసాడు నెమ్మదిగా సబ్సిడీమీద వచ్చిన నూలును బ్లాక్‌లో అమ్ముకుని బంగ్లాలు కట్టుకున్నాడని, మంచి చేనేత వ్యాపారవేత్త స్థాయికి ఎదిగాడని చాలామంది విమర్శిస్తుంటారని తెలుపుతాడు. నారాయణ సేటు తండ్రి బట్టలు నేసి పులిసిన అంబలి జుర్రి బతికినవాడు. కొడుకు మాత్రం కులసంఘ నాయకుడిగా తను ఎదుగుతూ, తన సామాజిక వర్గానికి అన్యాయం చేసాడనే వాస్తవాలను వెల్లడిచేస్తాడు. రచయిత ఏవిధమైన రాగద్వేషాలను దరిచేరనీయకుండా పద్మశాలీల జీవన ప్రయాణాలను నిశితంగా విశ్లేషించారు.

జీవనయానం నవలలో బి.ఎస్.రాములు బి.సీ సామాజిక వర్గ సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే పనిని ఉద్యమస్థాయిలో చేపట్టారు. ఒక వెనకబడిన కులాల నుంచి వచ్చిన వర్గానికి ప్రతినిధిగా తనవారికి బలమైన తాత్విక గొంతుకగా మారాలనే నిశ్చితాభిప్రాయంతో వున్నారు. ఆ ఉద్వేగంలో ఎగిసిపడుతున్న వాదప్రతివాదనలన్నింటిని ఆయా పాత్రధారులకు ఆపాదిస్తూ బి.సి సామాజికులకు తెలియని విలువైన అంశాలను పూసగుచ్చినట్లు వివరించే ప్రయత్నం చేస్తారు. ఈ వరుసలో నవలలో చాలాసార్లు కులాలకు సంబంధించిన ప్రస్తావనలు, విశ్లేషణలు వుంటాయి. ఆయా కులాలకు మాత్రమే వుండే ప్రత్యేకమైన సంస్కృతి, స్వభావాలను అలవోకగా సహజమైన సంభాషణలతో పాత్రలతో మాట్లాడిస్తారు. బి.ఎస్.రాములు బీసీ కమీషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వుండటం వలన మరింత జాగరూకతతో బీసీ కులాలపట్ల అవగాహనను పెంపొందించడానికి పూనుకున్నట్లుగా అనిపిస్తుంది. బి.సీలకు తెలియని బి.సీల చారిత్రక విశేషాలను, జ్ఞానాన్ని బహుజనులకు ఉపాధ్యాయుడిగా బోధిస్తారు. బి.సి కులాలకు వుండవలసిన పౌరుషాన్ని, చైతన్యాన్ని సుతిమెత్తగా మేల్కొలుపుతారు. 1956లోనే డా॥ రామమనోహర్ లోహియా 'బీసీలు అధికారం చేపట్టాలని' అన్న మాటల్ని ఉటంకిస్తు వర్తమానంలో బీసీలు రాజకీయ వెనుకబాటుతనాన్ని గురించి శాస్త్రీయంగా విశ్లేషించారు. రచయితలో బీసీ కుల స్పృహకంటే కూడా బీసీలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడానికే ఎక్కువ తపించిపోయాడు. అందుకే విక్రాంత్ తల్లి సక్కుబాయిని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా గెలిపించి బీసీ మహిళలకు భవిష్యత్ సంకేతాలను పంపించాడు. బీడి కార్మికురాళ్ళను రాజకీయ నేతలుగా ఎదిగేటట్లుగా మలచాడు. 'బతుకుపోరు'లో మరింత ఉన్నత విజయాన్ని అందుకుని రాజ్యాధికారపు దారుల్లోకి బిసీ సామాజికవర్గం పయనించాలనే ఆకాంక్షను గాఢంగా జీవనయానంలో బి.ఎస్. ప్రకటించారు. వెనుకబడిన కులాలలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఒక సామాజిక తాత్త్వికుడిలా ప్రవచించాడు రచయిత.

బి.ఎస్. రాములుకు అర్థశాస్త్ర సిద్ధాంతాల పట్లకూడ లోతైన అవగాహన వున్నట్లు తెలుస్తుంది. జీవనయానం నవల ప్రఖ్యాత ఫ్రెంచి సామాజిక అర్థశాస్త్రవేత్త ప్రసంగం నేపథ్యంలో ఆరంభమవుతుంది. అమర్త్యసేన్ సంక్షేమ అర్థశాస్త్రంకన్నా క్యాపిటల్–సోషల్ ఎకానమీ (పెట్టుబడి–సామాజిక అర్థశాస్త్రం) ఎంతో సమగ్రంగా ఉందనిపిస్తోంది. ఇది సోషలిస్ట్ దృక్పథానికి దగ్గరగా ఉందనిపిస్తోంది' అన్న మెడికో రాధ మాటలు కథకన్నా ఎక్కువగా తెలియని ఆసక్తిని కలిగిస్తోంది. ఎంతో లోతుగా సామాజిక అర్థశాస్త్రం పట్ల అధ్యయనం వుంటేనే అటువంటి స్టేట్‌మెంట్‌ను ఇవ్వగలుగుతారు. మానవ సంబంధాలను ఆర్థిక విషయాలు ఎంత తీవ్రంగా ప్రభావితం చేస్తాయో అనేక అనుభవాల కలనేత జీవితం రచయితది. అందుకే సామాజిక అర్థశాస్త్రవేత్తలు చెప్పిన సిద్ధాంతాలన్నింటిని మానవసంబంధాలకు సరిపోయేలా అన్వయిస్తూ తన పరిశీలనలను పాత్రలపరంగా ప్రకటిస్తారు బి.ఎస్. రాములు. "బాకీపెట్టుబడి, జీవితాభివృద్ధి కోసం పెట్టుబడి రెండూ వేరువేరు సామాజిక సంబంధాలను పరిణామాలను సృష్టిస్తాయంటాడన్న" ఫ్రెంచి శాస్త్రవేత్త మాటలను ఉదాహరిస్తూ అమెరికా ప్రపంచబ్యాంకు యిచ్చే పెట్టుబడులన్నీ బాకీ పెట్టుబడులే తప్ప నిజమైన సామాజికాభివృద్ధి పెట్టుబడి క్రమాలకు సంబంధించినవి కావు అని అమెరికా ముసుగును తొలగిస్తాడు. పెట్టుబడి అంతిమలక్ష్యం ఆధిపత్యం, స్వప్రయోజనమన్నట్లుగానే నారాయణ సేటు తనమీద పెట్టే పెట్టుబడి కూడా అటువంటిదే అని అరవింద్ అనుకుంటాడు. అరవింద్ మాటలు మానవ సంబంధాల వెనకున్న గుట్టును విప్పిచెబుతుంది. జీవనయానంలోని సామాన్యపాత్రలు ప్రసిద్ధ అర్థశాస్త్రవేత్తల సిద్ధాంతాలను ఆలోచనలను అలవోకగా తమ జీవితానుభవంలోంచి వెల్లడి చేస్తాయి. వీటన్నింటి వెనకున్న రచయిత తమ ఆర్థిక జ్ఞానాన్ని ఆర్జిత నైపుణ్యంగా ఎలా మలచుకోవాలో పాత్రల పరిణామక్రమంలో నిరూపించి చూపించాడు. ఆర్థిక పరిణామాలు మనిషి జీవితంలో ఎంత కీలకమైన పాత్ర వహిస్తాయో జీవనయానంలో అన్ని పాత్రలు సాక్షీభూతంగా నిలబడుతాయి.

జీవనయానం నవలలో అనేక స్త్రీ పాత్రలు ప్రాధాన్యతను సంతరించుకుని కథాగమనంలో తమదైన ఆత్మవిశ్వాస ముద్రను వేస్తాయి. బి.ఎస్.రాములుకు స్త్రీల ఎదుగుదలపై వారి సాధికారికత పట్ల అనుకూల ధోరణిని అవలంభించారు. స్త్రీ పాత్రలు తమ అభిప్రాయాలను ప్రకటించడంలో ఎటువంటి మొహమాటానికి తావివ్వకుండా ప్రవర్తించేటట్లుగా తీర్చిదిద్దారు. కొన్ని పాత్రలు మాత్రం తమ మనోభావాలను వ్యక్తపరచడంలో కొంత వెనకాముందు సంశయించినట్లుగా కనిపిస్తుంది. లత పాత్రద్వారా మాత్రం స్త్రీవాద భావజాలానికి సంబందించి వాద సంవాదాలన్నింటిని ఆయా సందర్భాలలో సందర్భోచితంగా చర్చించారు. ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ ఐసిఎస్ఆర్ హాలులో ఫెమినిజంపై జరిగిన సెమినార్‌లో ఒక అమెరికన్ ఫెమినిస్ట్ చెప్పిన అభిప్రాయాలు జీవనయానం నవలలో ఒక ప్రధాన చర్చగా సాగుతుంది.

"ప్రేమ పెళ్ళి, కుటుంబవ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి ఇవన్నీ రాజకీయాలే. ప్రతివ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే. సామాజికమైనదే. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువలవల్ల సాధ్యపడుతున్నది'' ఈ అభిప్రాయాలకనుగుణంగా జీవనయానం నవలలో పరిస్థితులకు అన్వయం చేసుకోవచ్చు. ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, పెట్టుబడి, రాజకీయాంశాలు అన్నీ ఈ నవలలో వేరువేరు సందర్భాలలో కథాగమనానికి సహకరిస్తాయి.

**ఒక విశాలమైన మైదానంలో అనేక విభిన్న జీవితాలను ఒక చోట పేర్చి ఏరియల్ షాట్ పద్ధతిలో ఈ నవలను దృశ్యీకరించారు.**

ఈ నవలలో స్త్రీవాద ధోరణులకు సంబంధించి చెప్పిన మాటలు ఆయా పాత్రలను ఉద్దేశించి చెప్పారనే సందేహం కలుగుతుంది. "నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడి వర్గాల, పురుషాధిపత్య వాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్యకాదు.

తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్దహోదాతో పెళ్ళిచేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్నిబట్టి కట్నం లాగుతారు. మనిషి యిష్టాయిష్టాలను మనిషిగాకుండా హోదాలు, స్థలకాలాలు, భావాలు, అర్హతలు నిర్ణయిస్తుంటాయి" అని ఫెమినిస్టులు చేసిన విశ్లేషణలు జీవనయానం నవలలోని ఆయా కుటుంబాలలోని వ్యక్తులకు ఆపాదించి చెప్పాడా రచయిత అన్పిస్తుంది. రాధ పెళ్ళి విదేశీ డాక్టర్‌తో సెటిలై పోవడంలో హోదా, ఉద్యోగం ప్రాధాన్యం వహించాయి. అప్పటివరకు అరవింద్‌ను ఇష్టపడ్డట్టుగా అనిపించిన రాధ స్వభావం ఒక్కసారిగా మారిపోతుంది. తండ్రి చూసిన గొప్ప సంబంధాన్ని సంతోషంగా ఒప్పుకుంటుంది. డాక్టర్ కోర్స్‌లో సీటురానప్పుడు నారాయణసేటు అరవింద్‌కుటుంబాన్ని దూరం పెట్టాడు. అవమానించాడు. అదే అరవింద్ డాక్టర్‌కోర్స్‌లో సీటువచ్చాక నారాయణసేట్ ప్రవర్తనే మారిపోయింది. డబ్బు అప్పివ్వడానికే పనికిరాని కుటుంబానికి ఇప్పుడు తన కూతురు నిర్మలనిచ్చి పెళ్ళి చేయడానికి ఆత్రుతపడ్డాడు. లత మొదట్లో అరవింద్‌ను ఇష్టపడుతుంది. అతడిని పెళ్ళి చేసుకోవాలనుకుంది. విక్రాంత్ కుటుంబంతో అనుబంధం ఏర్పడ్డాక, విక్రాంత్ మనోభావాలు అర్థమయ్యాక అతనంటే ఇష్టపడుతుంది లత. స్త్రీవాద సిద్ధాంతం చెప్పినట్లుగానే లత నిర్ణయం ఉంటుంది. పెళ్ళి అనేది రెండు హృదయాలకు సంబంధించిన ఆంతరంగిక స్పందనగా భావిస్తుంది. ఒక్కసారిగా తన అభిరుచులకు విక్రాంత్ సరైనవాడని తన జీవన సహచరుడిగా ఎన్నుకుంటుంది. రచయిత లతపాత్రను స్త్రీవాదుల అడుగుజాడలలో నడిపాడు.

మరోవైపు తెలంగాణవాది, అధ్యాపకుడైన విక్రాంత్ ఫెమినిజానికి వ్యతిరేకంగా కనబడటం గమనార్హం. తెలంగాణ ఉద్యమం వ్యాప్తిచెందకుండా ఫెమినిజం రూపంలో ఏవో ప్రయత్నాలు జరుగుతున్నాయని విక్రాంత్ ఫెమినిజానికి వ్యతిరేకంగా కనబడటం విశేషం. తెలంగాణ ఉద్యమం వ్యాప్తిచెందకుండా ఫెమినిజం రూపంలో ఏవో ప్రయత్నాలు జరుగుతున్నాయని విక్రాంత్ బలంగా విశ్వసిస్తాడు. అదేమాట స్త్రీవాదులతో అంటాడు. అప్పుడు లతనే ఈ విధంగా వాదిస్తుంది. "ఆడవాళ్ళ అభివృద్ధి చూసి ఓర్వలేనితనం మీది. మీ మగ పెత్తనం సాగాలని చెప్పకుండా ఇదేదో మీ తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకమని భావించడం అవివేకం, ఈర్ష్య, అహంకారం తప్ప మరేం కాదు" అని సమాధానమిస్తుంది. ఈ సందర్భంలోనే రచయిత తెలుగులో స్త్రీవాద కవిత్వోద్యమం ఉధృతంగా మొదలయినప్పుడు వచ్చిన విమర్శలను కూడా ఉదాహరిస్తాడు. "పేరెందుకుగానీ ఒక మహాకవి కొవ్వెక్కిన మహిళలదే ఈ ఫెమినిజం అని అంటే, ఈ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకాయన తొడబలిసిన మహిళలవాదం ఈ ఫెమినిజం" అని అన్నాడని ప్రస్థావిస్తాడు. విక్రాంత్‌లాంటి అధ్యాపకుడు స్త్రీవాదం పట్ల అపోహలు పెట్టుకోవడంలో తప్పులేదనే సూచనకూడా ఇందులో దాగివుంది. బి.ఎస్. రాములు ఈతరం స్త్రీవాదాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలనే ప్రయత్నం పాత్రల సంవాదాల ద్వారా తెలియ జేస్తున్నాడు. స్త్రీవాద తాత్త్విక భూమికను గౌరవించిన రచయిత ఈ నవలలో కొన్ని చోట్ల స్త్రీల స్వేచ్ఛకు పరిమితులు విధించే ప్రయత్నం చేసినట్లుగా అనిపిస్తుంది. భర్తచనిపోయిన రాధకు, నిర్మలకు పెళ్ళిచేయడంతో వారి జీవితం ఒక మంచి ముగింపుగా భావించాడు. ఇది కథకాబట్టి తనకు మంచి అనిపించిన సంబంధాన్ని చూసి ఆయా పాత్రల పెళ్ళిళ్ళు చేసాడు. దానితో వారి జీవితానికి సంపూర్ణత, సార్థకత చేకూరిందనే భావనను అందించాడు. వాస్తవ జీవితంలో అట్లాంటి పెళ్ళి సంబంధాలు దొరకడం కష్టం. నిజానికి ఇప్పుడెవ్వరూ స్త్రీ, పురుషులు కూడా పెళ్ళి చేసుకోవడమే శాశ్వత పరిష్కారమని నమ్మడం లేదు. రచయిత "మాతృస్వామిక వ్యవస్థతో ఫెమినిజంకన్నా వందరెట్ల శక్తితో అద్భుతాలు సృష్టించవచ్చు" అని లత పాత్ర ద్వారా చెప్పిస్తాడు. ఆ మాతృస్వామిక స్పర్శతోనే ఇందులోని స్త్రీ పాత్రలను సృష్టించినట్లుగా అర్థమవుతుంది. స్త్రీలైనా, పురుషులైన ఒక్కసారే ప్రేమిస్తారు. ప్రేమ విఫలమైతే ఒంటరిగానే ఉండిపోతారు. మరొకరికి చోటు ఇవ్వరనే ఒక స్థిరపడిన సెంటిమెంట్‌లకు, కాలం చెల్లిన కొన్ని పద్ధతులను, అభిప్రాయాలను బి.ఎస్. రాములు పక్కనపెట్టారు. ప్రేమ వైఫల్యం, వ్యక్తుల మరణాలు జీవనగమనానికి, గమ్యానికి అవరోధం కాదనే సానుకూల పరిణామాలు చిత్రించడం ఈ నవలలోని స్ఫూర్తివంతమైన అంశంగా పేర్కొనవచ్చు.

జీవనయానం నవల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధనకు సంబంధించిన అంశాలను కూడా చర్చించింది. ఉస్మానియా యూనివర్సిటీలో పి.జి. చేసి అధ్యాపకుడిగా పని చేస్తున్న విక్రాంత్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటువల్ల కలిగే ప్రయోజనాలను తెలపడానికి సెమినార్లలో మాట్లాడి వస్తుంటాడు. సీనియర్ ప్రొఫెసర్లు, గొప్ప మేధావులు ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ ట్రస్ట్'

**జీవనయానం అచ్చమైన తెలంగాణ నవల. పాత్రల సంభాషణల్లో అడుగడుగునా తెలంగాణ భాష వినబడుతూ మనకు తెలిసిన స్థలంలో పరిచిత వ్యక్తులతో మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది.**

కార్యాలయాలంలో జరిగే చర్చల్లో విక్రాంత్ ఉత్సాహంగా పాల్గొంటాడు. అక్కడి చర్చలో భాగంగా గిర్గ్లానీ నివేదిక, 610 జీవో, 1969 జైతెలంగాణ ఉద్యమం, 369 మంది ఉద్యమకారుల బలిదానం, 1955 నాటి ముల్కీ నిబంధనలు, పెద్దమనుషుల ఒప్పందాల్ని సుప్రీంకోర్టు కొట్టివేయడం, 1972లో జైఆంధ్ర ఉద్యమం, సిక్స్‌పాయింట్ ఫార్ములా మొ॥న అనేక చారిత్రకాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అరవింద్ లాంటి మెడిసిన్ విద్యార్థులకు ఇవన్నీ వింటుంటే కొత్త ప్రపంచంలా అనిపిస్తుంది. అర్థ అయ్యాకానట్టయి బుర్ర వేడెక్కి పోయేది. తలపట్టుకునేవాడు. తెలంగాణకు జరిగే అన్యాయాలను మరింత సన్నిహితంగా తెలియజేయడానికి రచయిత నిర్మల భర్త మదన్ ఆత్మహత్యను సృష్టించాడు. ఇట్లాంటి ఆత్మహత్యల నిజంగా ఎన్నో జరిగాయనే వాస్తవాన్ని బలంగా చెప్పడానికి ఈ సంఘటన దోహదపడుతుందనేది తెలంగాణ ఉద్యమకారుడైన రచయిత విశ్వాసం. మదన్ సిన్సియర్ లెక్చరర్. రెండుసార్లు సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్ళి విఫలమయ్యాడు. ఎవరో కావాలని పడగొట్టారని బాధపడ్డాడు. సివిల్స్ అనేది కేంద్రప్రభుత్వ పరిధిలోని అంశం కాబట్టి తెలంగాణ అనే దృష్టితో చూడకూడదేమో. కాని మదన్ స్టేట్ గవర్నమెంట్ నిర్వహించే గ్రూప్‌వన్‌లోనైనా సెలక్ట్ అవుతానని నమ్మకం పెట్టుకున్నాడు. రాజకీయాలు, అధికారం అంతా ఆంధ్రావాళ్ళదే. అన్నీ పైరవీలే. సూట్‌కేస్‌లు చేతులు మారాయి. మదన్ గ్రూప్‌వన్‌లో కూడా సెలక్ట్ కాలేదు. తట్టుకోలేకపోయాడు. ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ద్వారా విక్రాంత్, అరవింద్‌లకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడం ఎంత ముఖ్యమో తెలిసివచ్చింది. "ఇది ఆత్మహత్య కాదు. ప్రభుత్వం చేసినహత్య ఆంధ్రా ప్రభుత్వం తెలంగాణవారికి చేస్తున్న అన్యాయాల్తో ఇలా ఎంతో మంది బలైపోతున్నారు. నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు." అని మదన్ శవయాత్ర వెంట నడుస్తూ ఆవేశంగా విక్రాంత్ చుట్టూవున్న వారితో అంటాడు.

రచయిత బి.ఎస్. రాములు అనేక ఉద్యమాలలో చైతన్యవంతమైన భూమికను నిర్వహించారు. ఆయా ఉద్యమాల నిర్మాణాత్మక కార్యక్రమ రూపకల్పనల్లో భాగస్వామ్యులయ్యారు. ఉత్తర తెలంగాణవాసిగా ఆయా ప్రాంతాలలోని దోపిడిని, వెనుకబాటుతనాన్ని, ఆధిపత్యాల్ని దగ్గర్నుంచి చూసారు. ఒక ప్రాంతం అస్తిత్వ సంఘర్షణ ఎంత తీవ్రంగా వుంటుందో తెలంగాణవాదిగా ఆ బాధను, వేదనను అనుభవించారు. తెలంగాణ జనజీవితంలో ఉద్యమం ఒక అనివార్యమైన అధ్యాయంగా, నిత్యావసర పోరాట వస్తువుగా పరిణమించిన తీరును ఈ తెలంగాణ ఉద్యమ ప్రస్థావనలు బలపరుస్తాయి. ఈ నేపథ్యంలో బి.ఎస్. రాములు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను విక్రాంత్ పాత్రద్వారా ప్రభావపూరితంగా వ్యక్తపరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయాలన్నీ కొన్ని సామాజిక వర్గాల ఆధిపత్యంలో సాగుతున్న దోపిడీ ధోరణులను కూడా రచయిత నిశితంగా విమర్శించారు. డా.జయశంకర్ చెప్పిన మాటలు కూడా రచయిత విస్మరించలేదు. కేవలం మన రాష్ట్రసాధన కోసమే గాకుండా వర్తమాన రాజకీయాల్లోనూ మన ప్రాతినిధ్యం వుండాలనే ఆశయం రచయితలో వుంది. "పార్టీ ఏదైతేందీ? మనవాళ్ళను మనం గెలిపించుకోవాలె. రాధను ఎంతకష్టపడైనా సరే మనం గెలిపించుకోవాలె. మనం ఊర్లు తిరగాలె. మన బిసీ, ఎస్సీ వాళ్ళనందరినీ ఒక్కటి చేయాలె." అని లత ద్వారా రచయిత తన భావాలను ప్రకటిస్తాడు. బీసీలు స్థిరమైన ఓటుబ్యాంకుగా మారి తమ వాళ్ళకు గెలిపించుకునే చైతన్యాన్ని విస్తృతపరచిన బహుజనవాద మహానాయకుడు కాన్షీరాం. వారి అడుగుజాడలలో ఈ బహుజన సాహిత్య తాత్త్వికకారుడైన బి.ఎస్. రాములు జీవనయానం నవలలోని పాత్రలను నడిపించాడు. రాధ ఎలక్షన్లో నిలబడి ఎమ్మెల్లేగా గెలుస్తుంది. రచయిత రాజకీయ దృక్పథం కూడా పాత్రల సంవాదంల్లోంచి, ఆచరణల్లోంచి వెల్లడవుతుంది.

**జీవనయానం నవల ఏ కొందరి జీవన గమనాన్ని తెలుపడంతోనే ఆగిపోలేదు. రేపటి ప్రపంచపు భౌతిక, తాత్విక ప్రయాణ దారులను నిర్దేశిస్తూ నడుస్తుంది.**

జీవనయానం నవలలో ఆయా సామాజిక వర్గాలు, కుటుంబాలు అనుసరించే విభిన్న సంప్రదాయాలు, ఆహారం తదితర అలవాట్లు, సాంస్కృతిక విశేషాలను సందర్భోచితంగా చెప్పడం చేసారు. విక్రాంత్ లత ఊరికి వెళ్ళినప్పుడు వాళ్ళింట్లో (ఉల్లిగడ్డ కోడిగుడ్డు కూరతో వేడివేడి) కారం ఊదుకుంటూ తింటారు. ఆ కారం ఘాటుకు వారి కళ్ళల్లో నీళ్ళు ఊరుతాయి. అది చూసిన రాజమ్మ "కారం ఎక్కువవేస్తే కూర ఆగివస్తది కొడుకా! ఇప్పుడు తక్కువేస్తే రుచే అనిపియ్యది" అని క్షమించమన్నట్లుగా చెప్తుంది. ఎంతో కొంత స్థిర ఆదాయమున్న కుటుంబంలోనే ఇటువంటి పరిస్థితి వుంటే రోజువారి కష్టం చేసుకొని బ్రతుకు వెళ్ళదీసే పేదల ఇళ్ళలోని దుస్థితిని మనం ఊహించవచ్చు. నిత్యావసరాలైన కూరగాయలతో సంతృప్తిగా తినలేని ఒక వాస్తవాన్ని ఆ సన్నివేశం వెల్లడిస్తుంది. పేదవారి వంటింటి పొదుపు రహస్యాన్ని రచయిత చెప్పకనే చెబుతాడు. నిర్మల భర్త మదన్ ఆత్మహత్య చేసుకున్న తదనంతర పరిస్థితులను, కార్యక్రమాలను సవివరంగా వర్ణిస్తుందీ నవల. కుటుంబంలో ఒక వ్యక్తి అర్థాంతరంగా చనిపోయినప్పుడు దగ్గరి బంధువులు, మిత్రులు, సంబంధంలేని వ్యక్తులు ఏవిధంగా స్పందిస్తారనీ విషయాల కు చాలా ప్రాధాన్యం ఇచ్చారు రచయిత. హస్పిటల్‌లో ఏడ్పులు, జ్ఞాపకాల ఎగపోత, అంత్యక్రియల ఏర్పాట్లు, కర్మకాండలు విధివిధానాలను తెలుపుతారు. ఎవరు అగ్గిపట్టాలి. కొందరెందుకు అగ్గిపట్టకూడదు, పాడెను కొందరే మోయాలి, కొందరు మోయడం అపచారం, గర్భిణీలు శవం వెంట నడవకూడదనడం,.... ఇలా అంత్యక్రియలను ఒక డాక్యుమెంటరీగా చూపించారు. ఒకప్రాణి చివరి యానంలో కూడా తెలంగాణా ప్రాంతీయులు ఆచరించే విభిన్న పద్ధతులను రికార్డ్ చేయాలని ఆశించివుండవచ్చు రచయిత.

జీవనయానం నవల సమకాలీన అంశాలను చర్చించే కూడలిగా తీర్చిదిద్దారు. స్థానిక, జాతీయ విషయాలనే గాకుండా అంతర్జాతీయ సంఘటనల్ని కూడా కథానుగుణంగా వాడుకున్నారు. రాధ వి.ఎల్. కాంట్‌ను పెళ్ళి చేసుకుని అమెరికాలో స్థిరపడుదామనుకున్నది. అమెరికాలో జరిగిన గొడవల్లో నల్లజాతీయులు జరిపిన తుపాకి కాల్పుల్లో వి.ఎల్. కాంట్ అన్యాయంగా చనిపోయాడు. ఒక్కసారిగా రాధ కలలుగన్న జీవితం తలకిందులైంది. జీవితం భారంగా కొన్నాళ్ళు గడిచిపోయింది. ఇక్కడ రచయిత ఉదార హృదయులు కాబట్టి ఎవరి జీవితాన్ని శాశ్వత కష్టాల్లోకి నెట్టివేయడు. రాధ నెమ్మదిగా కోలుకుని సిరిసిల్లలో క్లిక్ పెట్టుకుంటుంది. మంచి హస్తవాసిగల డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటుంది. ఎవరూ ఊహించని విధంగా ఎన్నికల్లో పోటీచేసి ఎమ్మెల్యేగా గెలవడమే గాకుండా మరో వివాహంతో జీవితాన్ని అద్భుతంగా మలచుకుంటుంది. అమెరికాలో జరిగే కాల్పుల్లో మనవాళ్ళు చాలామంది చనిపోతున్నారు. వారిమీద ఆధారపడిన కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిలుస్తున్నారు. ఇదంతా మనకు తెలిసిన అంతర్జాతీయ విషయమే. రచయిత ఈ అంశాన్ని తన నవలకు ఊహించని మలుపుగా వాడుకున్నారు. అదేవిధంగా నారాయణ సేట్ కొడుకు శ్రీనివాస్ జీవిత ఉత్థానపతనాలు కూడా మన చుట్టూ వున్న సమాజం నుంచి తీసుకున్నవే. తండ్రి అకస్మాత్తుగా చనిపోయాక శ్రీనివాస్‌కు స్వీయ నిర్ణయం, ఆర్థిక స్వేచ్ఛ వచ్చింది. అనుభవం లేకపోవడంవల్ల రాజకీయాల్లోకి అడుగుపెట్టి డబ్బంతా పోగొట్టుకున్నాడు. అందరితో పరిచయాలు మిగిలాయి. దాన్నే పెట్టుబడిగా మార్చుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారాడు. ఎమ్మెల్యే రాధకు నమ్మకంగా సహకరించి కోల్పోయిన రాజకీయ జీవితాన్ని ప్రారంభిస్తాడు. రాధ పాత్ర ద్వారా కలిగే పరిణామాలు జీవితంలో ఊహించని పరిణామాలకు ప్రతీకగా తీసుకోవచ్చు.

జీవనయానం అచ్చమైన తెలంగాణ నవల. పాత్రల సంభాషణల్లో అడుగడుగునా తెలంగాణ భాష వినబడుతూ మనకు తెలిసిన స్థలంలో పరిచిత వ్యక్తులతో మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. తెలంగాణ సమాజంలోని మధ్య తరగతికి చెందిన యువతీయువకుల ఆలోచనా ధోరణి, సైద్ధాంతిక దృక్పథాలు, భావోద్వేగపు అలజడులను పట్టుకునే ప్రయత్నం చేస్తుంది ఈ నవల. తెలంగాణ సమాజం ప్రపంచీకరణ మార్పులకు లోనవుతున్న కాలం. ముఖ్యంగా యువతరం ఆధునిక దశలోకి వేగంగా అడుగులు వేయడానికి సమాయత్తమవుతున్న కాలవేదిక ఈ నవల. రచయిత పాత్రల ప్రధాన కేంద్రంగా కథ నడిపాడు. కాని నిశితంగా పరిశీలిస్తే రచయితే అంతర్లీనంగా ఒక ప్రధానపాత్రగా నేపథ్యంలో కదులాడుతాడు. మిగతా పాత్రలన్నీ ఉపపాత్రలుగా తమ విధులను నిర్వర్తిస్తాయి. రచయిత ఏ పాత్రను ఖాళీగా కూర్చోబెట్టలేదు. ప్రతిపాత్ర ఏదో కార్యనిర్వహణ భారాన్ని మోస్తూనో, ఏదో కర్తవ్యాన్ని ప్రబోధిస్తూనో ముందుకు వెలుతుంటాయి. ఒక విశాలమైన మైదానంలో అనేక విభిన్న జీవితాలను ఒక చోట పేర్చి ఏరియల్ షాట్ పద్ధతిలో ఈ నవలను దృశ్యీకరించారు. ఉత్తర తెలంగాణ ప్రాంతపు స్థానిక ఇతిహాసంగా మలిచారు. జీవనయానం పీఠికలో రచయిత ఈ నవలను ఎలా చదవాలి, ఏ విధంగా అర్థం చేసుకోవాలి అనే సూచన చేస్తాడు. "మాగ్జిమ్ గోర్కీ చెప్పిన 'సోషలిస్టు వాస్తవికత' కథల్లో, నవలల్లో అంతర్లయగా కొనసాగించడం నా లక్ష్యం. జీవితం, మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో చెప్పడంతోపాటు, ఎలా ఉంటే బాగుంటుఉందో... ఆదర్శప్రాయంగా చిత్రించడమే సోషలిస్టు వాస్తవికత. ఎలా ఉందో, అలా ఎందుకు ఉందో చెప్పడంతోపాటు ఎలా ఉంటే బాగుంటుందో ఆదర్శంగా చిత్రించడం రచయితల, సామాజిక శాస్త్రవేత్తల కర్తవ్యం" అని బి.ఎస్. రాములు తన రచనా దృక్పథాన్ని ప్రకటిస్తారు. రచయిత తన దృక్పథానికి అనుగుణమైన మేనిఫెస్టోలాగా జీవనయానాన్ని ఆవిష్కరించారు.



2014 డిసెంబర్ 22న బుక్‌ఫేయిర్‌లో ప్రముఖ రచయిత బి.యస్.రాములు రాసిన "చూపు" నవల ఆవిష్కరణ సభలో గోరేటి వెంకన్న, బైస దేవదాసు, హిప్నో కమలాకర్, టంకశాల అశోక్, ప్రసంగిస్తున్న బి.యస్.రాములు, జూలూరి గౌరీశంకర్, కె.బి. గోపాలం, డా॥వి. ప్రకాశ్.



# "జాతీయ పతాకమా" వందనం !

భారతదేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం వచ్చింది. ఎంతో మంది స్వాతంత్ర్య యోధుల త్యాగ ఫలితమే మన స్వాతంత్ర్య ఫలం. స్వేచ్ఛా వాయువులను మనం పీలుస్తున్నామంటే దానికి కారణం స్వాతంత్ర్య పోరాట ఫలితమే. నాడు బ్రిటీష్ సామ్రాజ్య బానిసత్వ సంకెళ్ళ నుంచి భారతమాతను విముక్తి చేయడానికి దాస్యశృంఖలాలు తెంచుకుని, స్వేచ్ఛా స్వాతంత్ర్యం పొంగటానికి ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు కఠిన కారాగార వాసం అనుభవించారు. అంతకుమించి ఎందరో పోరాట యోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ఉరి కొయ్యలను ముద్దాడారు. వారి త్యాగనిరతి ఎంతో కొనియాడదగినది. వారి త్యాగాలు మనకు నిత్య మార్గదర్శకమయ్యాయి.

ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారు చేసిన ప్రాణ, ధన, మాన త్యాగాలను స్మరించుకోవల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడికి ఉంది. వారు చూపిన నిస్వార్ధ బాటలో నడవడమే మనం వారికి సమర్పించే ఘనమైన, నిజమైన నివాళి.

మన జాతీయ పతాకాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మన తెలుగువారైన, మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య గారు రూపొందించారు. 1921లో అప్పుడు విజయవాడలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సభ జరిగింది. ఆ సభలో జెండాను గాంధీజికి చూపించారు. అది జాతిపితకు బాగా నచ్చింది. ఆ జెండాలో మొదట ఎరుపు, ఆకుపచ్చ రంగులు మధ్యలో చరఖా బొమ్మ ఉండేది. ఎరుపు రంగు హిందువులకు, ఆకుపచ్చ రంగు ముస్లిం సోదరులకు గుర్తుగా వెంకయ్య దీనిని తయారు చేశారు. గాంధీజి ఎరుపు, ఆకుపచ్చల మధ్యన తెలుపు రంగుని మిగతా మతాలకు గుర్తుగా పెట్టారు. తరువాత ఎరుపుని కాషాయ వర్ణంగా మార్చారు. కాషాయ వర్ణం ధైర్యం, త్యాగానికి, తెలుగు శాంతికి నిజాయితీకి, ఆకుపచ్చ నమ్మకం, పరాక్రమానికి గుర్తులుగా భావించి ఈ మార్పులను చేశారు. 1931లో దానిని మన "జాతీయ పతాకం"గా ప్రకటించారు. 1947 జూలై 22న దీనిని స్వాతంత్ర్య భారతావనికి జాతీయ పతాకంగా ఆమోదించారు. మధ్యలో చరఖాకు బదులు ఆశోక చక్రాన్ని చేర్చారు. ఈ అశోక చక్రంలో 24 ఆకులు ఉన్నాయి. వాటి భావాలు ఈ రకంగా ఉన్నాయి. 1 ప్రేమ 2 ధైర్యం 3 సహనం 4 శాంతి 5 కరుణ 6 మంచి 7 విశ్వాసం 8 హుందాతనం 9 సంయమనం 10 లాభాపేక్ష లేకుండుట 11 త్యాగ నిరతి 12 నిజాయితీ 13 కచ్చితత్వం 14 న్యాయం 15 దయ 16 ఆహ్లాదం 17 ఆర్ధ్రత 18 ధర్మాధర్మ విచక్షణ 19 జాతి 20 భగవంతుని పట్ల భక్తి 21 ఈశ్వర జ్ఞానం 22 నైతికత 23 పాపభీతి 24 భగవంతుని పట్ల శ్రద్ధ, ఆసక్తి, భక్తి విశ్వాసాలు

స్వాతంత్ర్య పోరాటం తరువాత 1947 ఆగష్టు 15న తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎర్రకోటపై జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి ఆ సాంప్రదాయం కొనసాగుతోంది. ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మనమందరం కలిసి పండుగ చేసుకుందాం. ఆర్థిక మరియు సాంఘిక అభివృద్ధి కొరకు సంయుక్తంగా చేతులు కలుపుదాం.

" జాతీయ పతాకమా" వందనం !
భరతమాత నీకు పాదాభివందనం !!



– తాడినాడ భాస్కరరావు
9441831544


# కవిత్వం... మహోన్నత శిఖరం

**– కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్.గోపి**

కవిత్వం మహోన్నత శిఖరంలాంటిదని,అది అందరికీ సాధ్యం కాదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్.గోపి అన్నారు. ఆగష్టు10 న పాలమూరు సాహితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ రచించిన పసిడి నానీలు ఆవిష్కరణ సభకు విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం సమాజానికి దిక్సూచి అని,సమాజాన్ని మార్చే శక్తి కవిత్వానికే ఉందని కొనియాడారు. శ్రీకాంత్ రచించిన అనేక నానీల్లో పరిపక్వత కన్పిస్తుందని,మంచి కవిత్వాన్ని వెలువరించాడని అభినందించారు. నానీ ప్రక్రియ తెలుగు సాహిత్యంలో బహుళ ప్రజాదరణ పొందిందని,ఇప్పటికే 350 మందికి పైగా కవులు కవితా సంపుటాలను వెలువరించారన్నారు.ముఖ్య అతిథి, ఆవిష్కర్త జలజం సత్యనారాయణ మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో విరివిగా కవిత్వం రాస్తున్న వారిలో భీంపల్లి ఒకడని కొనియాడారు. ఇపుడు వెలువరించిన పసిడి నానీలు లో చక్కని కవిత్వం వెలువరించారన్నారు.సభాధ్యక్షులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ అనుభవంతో కూడిన కవిత్వాన్ని భీంపల్లి వెలువరించాడని,మంచి కవిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథి బుర్రి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ భీంపల్లి రాసిన ప్రతి నానీల్లో జీవితానుభవం కన్పిస్తుందన్నారు.ఆత్మీయ అతిథి డాక్టర్ బోగ కోదండపాణి మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో సాహిత్యం విరివిగా వస్తుందని,సమాజాన్ని మార్చే కవిత్వం రావాలని కోరారు.పుస్తక సమీక్షను యువకవి పుట్టి గిరిధర్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో కె.లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ గుంటి గోపి,డాక్టర్ గోపినాథ్ రాథోడ్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న డా॥యన్.గోపి



'పసిడి నానీలు' ఆవిష్కరణ సభలో అతిథులు.

# కడారు మనో గీతికలు

అవసరాన్ని బట్టి
మైనంలానో, వజ్రంలానో
మారాలి ఏ మనిషైనా!
మంచుగడ్డలాగానో, మరబొమ్మగానో కాదు!

పరిమళం, యవ్వనం
తళుకు బెళుకుల్లాంటివి
మెరుపులా మెరిసి
త్రుటిలో మాయమయ్యేవే!

కష్టసుఖాల జీవితం
కడలితో సమానం!
అంతరంగంలో అగ్నిపర్వతాలు
శిరస్సు మీద తరంగాలు!!

పాల ధర పెరుగుతుందని
సామాన్య జనాల గోల!
పెరుగకుండా ఎలా వుంటుందీ
రాతి విగ్రహాలు కూడా పాలు తాగితే!

తాళి కట్టిన రోజే
తలవంచడం ఆడపిల్ల వంతు!
ఆ తరువాత ప్రతిరోజూ
తల వంచడం మొగుడి వంతు!

ఆకాశానికి నిచ్చెన వెయ్యాలనుకోవడం
అత్యాశ!
ఎండమావుల్లో నీటికై వెదకడం
ప్రయాస!

పల్లకీ ఎక్కాలని
అందరికీ వుంటుంది!
మోయడానికి మాత్రం
ఒక్కడూ రాడు!

అచ్చు వేయబడిన పుస్తకం
ఆడంబరంగా ఆవిష్కరించబడింది!
వంద శాతం డిస్కౌంటిచ్చినా
ఒక్కరైనా కొనడం అనుమానమే!

గగన తలాన ఎగిరే పతంగమా
ఎత్తున వున్నావని మిడిసి పడకు!
నీతైతక్కలన్నీ
దారం పుటుక్కుమని తెగేదాకనే!!

వాడిపోయేవి దండల్లో పువ్వులే
దారం మాత్రం కాదు!
ఊరేగింపుల్లో అలసిపోయేది జనాలే
నాయకులు మాత్రం కాదు!



–కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

# చేనేతకు చేవ "మాచన" సేవ

**విద్యార్థి దశ నుంచే చేనేత వస్త్రాల వాడకం**





మాచన రఘునందన్ వృత్తి రీత్యా ప్రభుత్వ అధికారిగా సేవలందిస్తూనే.. ప్రవృత్తి గా చేనేత కూ చేతనైనంత సేవ చేస్తున్నారు.

డియర్ ఫ్రెండ్.. ప్లీ..జ్ వియర్ హ్యాండ్లూమ్. అంటూ ప్రాధేయపడి మరీ పలకరించే తమ స్నేహితుడి కోసం చేనేత వస్త్రాలను ధరించే వారు కొందరైతే, వియర్ హ్యాండ్లూమ్.. బీ హ్యాండ్సమ్ అని మాచన రఘునందన్ చెబితే గాని చేనేత వస్త్ర ధారణ పై తమకు అంతగా దృష్టి మళ్లలేదు అనే వారు మరి కొందరు.అబ్బ.. ఈ చొక్కా ఎంత బాగుందో ఎక్కడ కొన్నావ్.. మిస్టర్ "మాచన" అంటే చాలు ఆ కంప్లిమెంట్ కామెంట్ చేసిన వారి చేత వారికి నచ్చిన ఆ అంగీ సమీపంలోని హ్యాండ్లూమ్ షోరూం లో ఆ పూటే కొనిపిస్తారు మాచన రఘునందన్. చేనేత వస్త్ర ప్రియుడిగా, ప్రోత్సహకుడిగా తన ఉనికిని చాటుకొనే ఈ వ్యక్తి వృత్తి రీత్యా అటు ప్రజా సేవకుడిగా పని చేస్తూనే ప్రవృత్తి గా చేనేత కు చేతనైనంత చేయూతనిస్తున్నారు ఈ ప్రజా సేవకుడు. చేనేత వస్త్రాల ను ధరించండి.. నేతన్నను ఆదరించండి. అంటూ అన్ని వర్గాల వారు విధిగా హ్యాండ్లూమ్ బట్టలు మాత్రమే వాడేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.తెలంగాణ పద్మశాలి ఆఫీషియల్స్ ప్రోఫ్ఫెషనల్స్ అసోసియేషన్ (టీ పాపా) కు రాష్ట్ర ప్రచార కార్యదర్శి గా వ్యవహరిస్తున్న మాచన రఘునందన్,చేనేతకూ ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రచారం చేస్తూ నేతన్నల బాగుకు మాట సాయం తో పాటు బాట సాయం చేసే మంచి మనసున్న మనిషిగా దిల్ దార్ డిప్యూటీ తహసీల్దార్ గా ప్రజా సేవతో పాటు, సంఘ సేవ చేస్తున్నారు. సన్నిహితులకు, బంధువులకు. మిత్రులందరికీ చేనేత వస్త్ర విశిష్టత ను వివరిస్తూ..వారిచేత కూడా చేనేత ఉత్పత్తులనే వాడేలా చేస్తున్నారు మాచన రఘునందన్. అందరిచేత సాధ్యమైనంత మటుకు చేనేత వస్త్రాలను వినియోగించేలా చేస్తూ. హ్యాండ్లూమ్ కు తన జీవితంలో అంత్యంత ప్రాధాన్యతనివ్వడంతో ఆదర్శంగా నిలుస్తున్నారు..పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్.


ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం .ఈ సందర్భంగా చేనేత కు చేవ కోసం తన వంతు చేయూత గా "మాచన" చేస్తున్న కృషి గురించి తెలుసుకుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు.చదువుకునే రోజులనుంచే నిత్యం చేనేత వస్త్రాల వాడకం ఆరంభించారు. తన వివాహ సమయంలో కూడా చేనేత వస్త్రాలను మాత్రవే విధిగా వాడేలా నియమం పాటించారు.అటుపిమ్మట వివిధ ప్రధాన,సాధారణ కార్యక్రమంలో కూడా హ్యాండ్లూమ్ వస్త్ర వినియోగాన్ని విస్తృతం చేశారు. చేనేత ఉపయోగాలను సందర్భానుసారంగా జనబాహుళ్యానికి తెలిసేలా తన దైనందిన జీవితంలో నిత్యం అనుదినం చేనేత వస్త్రాలనే ధరిస్తున్నారు. చేతిరుమాలు, తువ్వాలు, లుంగీలు,ఇలా ప్రతీ వస్త్ర ధారణకు చేనేత నే వాడుతున్నారు. 2015లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని కొత్త ఢిల్లీ లో రాపోలు ఆనంద భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరై తన నిబద్ధత చాటుకున్నారు.చేనేత కార్మికుల జీవితం ఆధారంగా ఇటీవలే వచ్చిన సినిమా మల్లేశం కు సైతం చక్కటి ఆదరణ లభించేలా "మాచన"ఇతోధిక సాయం చేశారు.ప్రతి ఏటా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారులకు చేనేత తువ్వాళ్లతో సత్కరిస్తారు.మిత్రుల వివాహాది శుభకార్యాలకు హ్యాండ్లూమ్ షోరూం ను సందర్శించేలా చేసి, నచ్చిన వస్త్రాలు తక్కువ ధరలకే లభ్యమయ్యే తీరును ప్రత్యక్షంగా వివరిస్తున్నారు.

డియర్ ఫ్రెండ్.. వియర్ హ్యాండ్లూమ్ అంటూ కరచాలనం సందర్భంగా పాలకరించటం తన ప్రత్యేకతగా చేసుకున్నారు.

గత 2 దశాబ్దాలుగా కేవలం చేనేత వస్త్రాలనే విధిగా ధరిస్తున్నారు. కుటుంబం కూడా ధరించేలా చేశారు.ఇంట్లో సైతం దుప్పట్లు,మొదలు వివిధ రకాల వస్త్రాలంకరణ కోసం చేనేతనే ఉపయోగిస్తున్నారు. పుట్టినరోజు.వివాహదినోత్సవాలకు కానుకలుగా చేనేత ఉత్పత్తులనే అలంకార వస్తువులుగా ప్రత్యేకంగా తయారు చేయించి ప్రదానం చేస్తున్నారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల దండలను యాదాద్రి జిల్లా రఘునాథపురం లో మాచన కృష్ణ ప్రత్యేక నైపుణ్యం చేత తయారు చేయించి ప్రముఖులను సత్కరిస్తున్నారు.సన్మానాలు,సత్కారాలకు శాలువాల బదులు కేవలం చేనేత తువ్వాళ్లను మాత్రమె వినియోగించాలని సూచిస్తున్నారు. హ్యాండ్లూమ్ ను ఆదరిస్తే.. ఒక నేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకున్నట్లే నని విషదీకరిస్తారు.రైతన్న కంటే నేతన్న నే అందరికీ అవసరమని, అన్నం లేకున్నా రెండు,మూడు రోజులు బతకొచ్చు కానీ, మానాన్ని కాపాడే వస్త్రం లేకపొతే క్షణం గడవదని చెప్తారు.చేనేత కుటుంబాలకు చెందిన యువతకు ఉన్నత విద్యా, ఉద్యోగావకాశాల లభ్యతపై అవగాహన కల్గిస్తున్నారు. మధ్యప్రదేశ్ సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ పరికిపండ్ల నరహరి యూవతకు చేసే లక్ష్య సాధన సలహాలను ప్రసంగాల విడియో లను చూపెట్టడం ద్వారా ప్రభుత్వ సాయంతో ఉన్నత ఉద్యోగాలను ఎలా సాధించగలరో వివరిస్తున్నారు.చేనేత వస్త్రాల ధారణ కోసం ప్రభుత్వ ఉద్యోగులకు రుణ సదుపాయం ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ తన సహోద్యోగులను హ్యాండ్లూమ్ వస్త్రాల కొనుగోళ్లకై ప్రోత్సహిస్తున్నారు.చేనేత విశిష్టత,ప్రత్యేకత లను ప్రాధాన్యత తో వివరించే మాచన రఘునందన్ శైలికి పద్మశ్రీ చింతకింది మల్లేశం సైతం ముగ్దుడై."అన్నా..నువ్వు చెప్పినట్లు ఎవ్వరూ చెప్పలేరు" అని తన ను అభినందించారని మాచన రఘునందన్ ఆనందం వ్యక్తం చేశారు.

(నేటినిజం ప్రత్యేక ప్రతినిధి)



# నిజదేవోభవ...

(జనం కోసం, సమాజవనంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదైవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

## శౌచమూర్తులు

ఉ॥ ప్రాణము లుగ్గబట్టి , చెడువాసన నాసికమందు దట్టినన్
మానము ప్రక్కనెట్టి యనుమానములేకను పట్టి చీపురున్
స్నానమొనర్చు జోగలను మన్నికతో శుచిగా నొనర్చగన్
పూనిన కార్యమే ఘనము! పుణ్యము మీదె ధరిత్రికెల్లెడన్.

ఆ॥ ఎవని కంపు వాని కింపందురే గాని
కృత విసర్జములను భరింప రెవరు
నట్టి పరులరోత నవలీలగా దీర్చు
అమృత హృదయు లంచు నభినుతింతు!

ఆ॥ కన్నతల్లియైన చిన్నిబాలల సేవ
రోజు రోజు సేయ రోయునేమొ... !
అన్నివేళలందు నందరి వ్యర్థముల్
తొలగజేయు దేవతలన మీరు!

చం॥ తెలతెలవారకన్ మునుపె తీయని నిద్రను వీడుకొల్పి, భూ
తలమును స్వర్గమున్ సలుపు దారిని చేరగ వత్తురమ్మ, మీ
వలపును మీ కుటుంబము కవారిత రీతిని దక్క కుండగా
నిలిచిన వృత్తినే దలచి, నిష్ఠుర మొందక, సేవగింపకన్.


ఆ॥ నగరమందు రోడ్లు నరకప్రమాణమే
రద్దిలోన విష సమృద్ధిలోన
అట్టి దారులన్ని యవలీలగా నూడ్చి
అద్దములుగ జేయు శుద్ధమునులు!

శా॥ ఇంటింటన్ యలనాడు వ్యాసముని కాశీ క్షేత్రమందున్ యశం
బంటన్ భిక్షను స్వీకరించి; యటులే యానంద మందారులై
కంటన్ మంటల నంటకన్ ప్రియమె సంగన్ చెత్త సైకొందురే!
మింటిన్ దాకెను మీ ప్రకర్ష ! సమతుల్ మేలంచు దీవించగన్.

తే॥ 'స్వచ్ఛభారత' మంతి నేడు సర్వజగతి
ప్రబలు చుండుట లెస్సయే! భవ్యగతిని
మీ శ్రమలను గుర్తించిన మేలుకాదె
సుగతి యగు నది జాతికిన్ ప్రగతి నిజము!


మ॥ మనసే మందిర మైన నేమి, శుచి నిర్వాణంబు కర్తవ్యమే
యనగా నేమి, నిరంతరంబు మనుజవ్యర్థంబులన్ దీర్చు జీ
వనమం దన్య విశేష సౌఖ్యములు నావంతైన వేయిచ్చునా....
యనుచున్ మీ కృషి కంజలింతు ననిశం బార్ద్రప్రమాణంబునన్.

కం॥ వందనములు మీ సేవకు !
వందనములు మీ సహిష్ణు వర్ధిష్ణుతకున్
వందేళ్ళు సుఖము నందుడి
మందార హృదంతరాళ మానుషులారా!



–దొరవేటి
సెల్:9866251679

# "కొత్త క్యాలెండరు" కవిత్వం ఆవిష్కరణ



గుంటూరు, బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికమీద సీనియర్ సిటిజన్స్ మహిళా విభాగం, రావి రంగారావు సాహిత్య పీఠం సంయుక్త నిర్వహణలో ఆగష్టు 16, శుక్రవారం సాయంత్రం 6 గం.కు డా. రావి రంగారావు వచన కవిత్వం "కొత్త క్యాలెండరు" గ్రంథావిష్కరణ సభ జరుగుతుంది. ప్రముఖ భాషావేత్త నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షులుగా, ప్రముఖ సాహితీవేత్త, ఆలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు షేక్ మస్తాన్ ముఖ్య అతిథిగా, డా. బీరం సుందరరావు, శ్రీ కోసూరి రవికుమార్ సమీక్షకులుగా, దేవాలయ పాలక మండలి అధ్యక్షులు శ్రీ చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రకాశకులుగా పాల్గొంటారు.

డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి, సంస్థల ప్రతినిధి



1982లో ప్రారంభించిన "నెల నెలా వెన్నెల" ఇంచుమించు ముప్పది వత్సరాలు ఔత్సాహికులపై కురిపించిన చంద్రికల సృష్టికర్త సి.వి కృష్ణారావు. ఆగస్ట్ 11న స్వర్గస్తులైనారు.ఆయన మృతికి నివాళులర్పిస్తున్న శీలావీర్రాజు, డా॥నాళేశ్వరం శంకరం, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు తదితరులు.

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్టి–74, జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

# తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్, విశాలసాహితి సంయుక్త ఆధ్వర్యంలో

## బి.ఎస్ రాములు 70వ జన్మదిన సప్తతి ఉత్సవాలు

## బి.ఎస్. రాములు సాహిత్య సమాలోచన

## ఆగష్టు 21, 22 రెండు రోజుల జాతీయ సదస్సు

కన్వీనర్:ఎన్. నీరజ,
అసోసియేట్ ప్రొఫెసర్(తెలుగు)
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్.
హైదరాబాద్-500004.

**మొదటిరోజు బుధవారం**
**మొదటి సమావేశం - 21 ఆగష్టు 2019**

అధ్యక్షులు - సూర్యధనుంజయ్ (తెలుగు శాఖ అధ్యక్షులు, ఓ.యు.)

1.ప్రపంచీకరణ నేపధ్యంలో వేపచెట్టు కథలు - ప్రొఫెసర్ పి. కనకయ్య - డీన్ తెలంగాణ యూనివర్సిటీ.
2.చూపు నవల సింహావలోకనం - డా॥ శ్రీదేవి - తెలుగు శాఖ అధ్యక్షులు - కాకతీయ విశ్వవిద్యాలయం.
3.బీడీ కార్మికుల జీవితాన్ని అద్దం పట్టిన బతుకుపోరు - తిరునగరి దేవకీదేవి - విశ్రాంత ప్రిన్సిపాల్ - శాప్ డిగ్రీ కళాశాల, వికారాబాద్.
4.స్వేచ్ఛనుండి విముక్తి - మానవీయ సంబంధాలు - జ్యోత్స్న ప్రభ - తెలుగు శాఖాధ్యక్షులు, బేగంపేట, మహిళా కళాశాల
5. తేనెటీగలు కథల్లో ఉద్యమ చైతన్యం - డా॥ తండు కృష్ణయ్య - తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల - నల్గొండ.

సమావేశకర్త - డా॥ కమల సుధారాణి

**రెండవ సమావేశం**
**అధ్యక్షులు - ప్రొఫెసర్ పి. కనకయ్య (డీన్ - తెలంగాణ యూనివర్సిటీ)**

1.తెలంగాణ సామాజిక అంతరంగ శోధన. ఇల్లు - వాకిలి కథలు - ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు - స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ.
2.కాలంతోపాటు నడిచిన కథకుడు బి.ఎస్. - సంగిశెట్టి శ్రీనివాస్ - ప్రముఖ తెలంగాణ పరిశోధకులు.
3.జీవనయానం - సామాజిక వాస్తవికత - డా॥ విద్యావతి - పూర్వ తెలుగు శాఖాధ్యక్షులు రెడ్డి కళాశాల.
4.బి.ఎస్. కథల్లో మహిళలు - చైతన్యం - అనిశెట్టి రజిత, ప్రముఖ రచయిత్రి.
5.విప్లవ దృక్పథంలోంచి బహుజన దృక్పథంలోకి బి.ఎస్. పయనం - డా॥ పగడాల నాగేందర్ - అసిస్టెంట్ ప్రొఫెసర్ నిజాం కళాశాల.
6.కాలం తెచ్చిన మార్పు - వస్తు వైవిధ్యం - డా॥ మొయిలి శ్రీరాములు, జవహర్ నవోదయ విద్యాలయం, సమస్తాపూర్, బిహార్.

సమావేశకర్త - డా॥ లక్ష్మీ విజయ

**రెండవ రోజు గురువారం**
**మూడవ సమావేశం - 22 ఆగష్టు 2019**
**అధ్యక్షులు - విహారి (సుప్రసిద్ధ రచయిత)**

1.విభిన్నదారుల్లో జీవనయానం - డా॥ ఎస్. రఘు - తెలుగు శాఖాధ్యక్షులు, కోఠి మహిళా కళాశాల, ఓ.యు.
2.ఇల్లు-వాకిలి వస్తు వైవిధ్యం - యం. రామలక్ష్మి - తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ - బిజేఆర్ ప్రభుత్వ కళాశాల.
3.దేశీ తాత్త్వికుడు విశాల స్వాప్నికుడు బి.ఎస్. - నందిగామ నిర్మల - అసిస్టెంట్ ప్రొఫెసర్ - ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి.
4.మమతలు - మానవ సంబంధాలు - డా॥ కర్రె సదాశివ - అసిస్టెంట్ తెలుగు ప్రొఫెసర్, కా.వి.వి.
5.స్మృతి - మానవ సంబంధాలు - డా॥ అదువాల సుజాత.
6.బతుకుపయనం - వస్తు వైవిధ్యం - డా॥ మొయిలి మోహన్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, బివికె డిగ్రీ కాలేజి, విశాఖపట్టణం.


సమావేశకర్త - జ్యోతిరెడ్డి

**నాల్గవ సమావేశం**
**అధ్యక్షులు - పత్తిపాక మోహన్ (నేషనల్ బుక్ ట్రస్ట్, సంపాదకులు, తెలుగు విభాగం)**

1.బి.ఎస్. కథల్లో తాత్త్వికత - విహారి - సుప్రసిద్ధ రచయిత
2.గెలుచుకున్న జీవితం - యాకమ్మ
3.చికాగోలో నానమ్మ - వస్తు వైవిధ్యం - జ్యోతిరెడ్డి ఏ.వి.పి.జి. సెంటర్.
4.ఇల్లు వాకిలి - వేముల శరణ్య - గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు.
5.బి.ఎస్. కథలు కుటుంబ సంబంధాలు - అన్నందాసు జ్యోతి.
6. A Perspective of B.S. Ramulu selected Short stories- స్వాతి శ్రీపాద, సుప్రసిద్ధ రచయిత.

**సమావేశకర్త - యం. రామలక్ష్మి**

## నేటి నిజాలు




# ఎదిరె చెన్నకేశవులు స్మారక పురస్కారాలు ప్రదానం





తొలితరం తెలంగాణ కథా, నవలా రచయిత మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎదిరె చెన్నకేశవులు స్మారక పురస్కారాలను వివిధరంగాలకు చెందిన వారికి ఆగష్టు11 న అందజేశారు. తెలుగు సాహిత్య వైభవం, పాలమూరు సాహితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఎర్రమంజిల్ లో గల ఇంజినీర్ ఇన్ ఛీఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2018 సంవత్సరానికి ఎదిరె చెన్నకేశవులు స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రసిద్ధ సాహిత్యవేత్త ఆచార్య మసన చెన్నప్పకు,చేనేత పురస్కారాన్ని చేనేత వర్గాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు చిక్కా దేవదాసుకు అందజేశారు.అలాగే 2019 సంవత్సరానికి ఎం.వి.నరేంద్రస్వామి స్మారక ఎ.బి.హెచ్ అవార్డును ప్రముఖ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జాతీయ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి,దాస్యం సేనాధిపతి,తెలుగు సాహిత్య వైభవం వ్యవస్థాపకులు మేక రవీంద్ర,పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,డాక్టర్ దాసోజు పద్మావతి, మూర్తి శ్రీదేవి, ఎం.విజయలక్ష్మి, పెసరు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేక రవీంద్ర సంపాదకత్వంలో వెలువడిన "అజాతశత్రువు అటల్ బిహారీ వాజపేయి" కవితా సంకలనాన్ని ఆచార్య కసిరెడ్డి, "మహాకవి విశ్వంభరుడు సినారె" కవితా సంకలనాన్ని ఆచార్య మసన చెన్నప్ప,ల్యాదాల గాయత్రి రచించిన "శ్రీకారం" కవితా సంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డిలు ఆవిష్కరించారు.

# సేంద్రియ ఎరువులతో చీడపీడలు దూరం

నిజామాబాద్,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే చీడపీడల బాధ కూడా ఉండదని వ్యవసాయాధికారులు అన్నారు.ఎప్పటికైనా సేంద్రీయ ఎరువులే మేలన్నారు. రైతు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులకు సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. పంట సాగులో రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం తీసుకొని సేంద్రియ ఎరువులను సొంతంగా తయారు చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులతో భూ మిలో అన్ని రకాల పోషకాల ఉత్పత్తి జరిగి పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు.

# రైతుబీమాతో అన్నదాతలకు భరోసా

జనగామ,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం అన్నదాతకు భరోసా అని జనగామ జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నిరంతరం రైతు శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు జీవిత బీమా రైతుల కుటుంబాలకు భరోసాను కల్పిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 55లక్షల మంది రైతులకు జీవిత బీమా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.ఐదు లక్షల బీమాను ఉచితంగా అందిస్తోందని చెప్పారు.రైతులు 60 ఏళ్ల పాటు అరిగోస పడ్డారని, రైతులకు పెట్టుబడి, రైతుబంధు బీమాతో ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో కరంట్‌తో బోరుబావుల మోటర్లు కాలిపోయేవని, ఎప్పుడు కరంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అలా లేదని అన్నారు. ఇప్పుడు రైతులకు 24గంటల నాణ్యమైన కరంట్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ఒక్క మోటారు కూడా కాలిపోవడం లేదని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మన నీళ్ల మంత్రి ఇక్కడి రైతులు కరువుతో పోరాడి చనిపోతుంటే పట్టించుకోలేదని అన్నారు.

# మహిళపట్ల అసభ్య ప్రవర్తన

## భర్త దాడిలో దుండగుడి మృతి

హైదరాబాద్,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి నిద్రిస్తున్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించడమే గాకుండా , అది గమనించిన మహిళ భర్త దాడి చేయడంతో అతను మృతిచెందాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.

సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. ఉప్పల్ రింగ్‌రోడ్డు ప్రాంతంలోని గుడిసెల ప్రాంతంలో రాజు తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అయితే సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో దుర్గా(30) అనే యువకుడు ఇంట్లో నిద్రిస్తున్న రాజు భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన రాజు అతన్ని ప్రశ్నించంగా.. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దుర్గా కత్తితో రాజుపై దాడిచేశాడు. దీంతో రాజు కర్రతో దుర్గా తలపై కొట్టాడు. దుర్గా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ దుర్గా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సబ్బని లక్ష్మీనారాయణకు గౌరవ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డి.లిట్) ప్రదానం.



ప్రముఖ కవి రచయిత, విద్యావేత్త, రిటైర్డ్ ఆంగ్ల ఉపన్యాసకులు సబ్బని లక్ష్మీనారాయణకు ఆగస్ట్ 10 న బెంగుళూర్ లోని భారతీయ విద్యా భవన్ లో జరిగిన స్నాతకోత్సవంలో మదర్ తెరిసా వర్చువల్ విశ్వవిద్యాలయం బెంగళూరు వారు గౌరవ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ( డి. లిట్.) ని ప్రదానం ప్రదానం చేసినారు . గత 4 దశాబ్దాల నుండి సబ్బని లక్ష్మీనారాయణ సాహిత్య సేవకు గుర్తింపుగా, . సబ్బని సాహిత్య కృషిని, రచలను పరిశీలించి ఈ విశ్వవిద్యాలయం వారు వారికి ఈ డి. లిట్. గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. విజయ సరస్వతి అమె పరిచయ కార్యక్రమం లో తెలిపారు. బెంగుళూర్ మదర్ తెరిసా వర్చువల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ డా. రూబెన్, రిజిస్ట్రార్ విజయ సరస్వతి, ముఖ్య అతిథి డా. హుజాఫియా కోరాకివాల, సంస్థ చైర్మన్ డా. మహమ్మద్ సయీద్, డి. ఆర్. డి. ఒ. శాస్త్రవేత్త డా. యెన్. ప్రభాకరన్ చేతుల మీదుగా ఈ గౌరవ డి. లిట్. డిగ్రీ ని సబ్బని అందుకు న్నారు. యూనివర్సిటీ కులపతి డా. రూబెన్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. డి. లిట్. గౌరవ డాక్టరేట్ పొందిన సబ్బని ని కరీంనగర్ రచయితలు, సంకేపల్లి నాగేంద్ర శర్మ, వాసం శివ నారాయణ, కామిరెడ్డి నారాయణ రెడ్డి,డా. ముదిగంటి సుధాకర్ రెడ్డి, డా. అద్వాల సుజాత, సాయినగర్ అభివృద్ధి సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ రాజు, యాదిరెడ్డి, డా. మచ్చ హరిదాసు, జగిత్యాల రచయితలు డా. జైశెట్టి రమణయ్య, శీలం జగతీధర్, సిరిసిల్ల శ్రీనివాస్, కళాశ్రీ సంస్థ గుండేటి రాజు తదితరులు అభినందనలు తెలిపారు



స్రవంతి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గానసభలో సినీసంగీత విభావరి జరిగింది. ప్రణయరాగ వాహిని-చెలి వసంత మోహని పేరున ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు చంద్రతేజను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని గాయని ఎస్. చంద్రజ్యోతి నిర్వహించారు. డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పాల్గొని గాయనీ గాయకులను అభినందించారు.

# భూ వివరాలు ధరణిలో నమోదు

## చురుకుగా సాగుతున్న కార్యక్రమం

జనగామ,ఆగష్టు13(ఆర్ఎన్ఎ): ధరణి వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి పాస్‌పుస్తకాలు భూ వివరాల నమోదును యుద్ధ ప్రతిపాదికన చేపడుతున్నారు. కొద్ది రోజులుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది ప్రత్యేకంగా ధరణి వెబ్‌సైట్‌లో వివరాలు, సవరణల నమోదుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు.సుమారు రెండేళ్లుగా భూరికార్డుల ప్రక్షాళన పనులను అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల అనుగుణంగా చేపడుతున్నారు.ఖాతాలకు సంబంధించి వివాదాలు, ఎన్ఆర్ఐ ఖాతాలు, ఆధార్‌నమోదు చేయకపోవడం, సర్వే పూర్తిచేయకపోవడం వంటి వివిధ కారాణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. శిఖం, ప్రభుత్వ బంచరాయి, పట్టా భూములున్నట్లు ప్రక్షాళనలో భాగంగా గుర్తించారు. వీటికి సంబంధించి సుమారు 9నుంచి 10వేల ఎకరాలు ప్రభుత్వ భూమి, బంచరాయి భూములున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మిగిలిన భూములకు సంబంధించి ఆయా ఖాతాల్లో సవరణను చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు రికార్డుల సవరణను శరవేగంగా చేపడుతుండటంతో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. దీంతో మిగిలిన 9శాతం రికార్డుల సవరణ త్వరలో పూర్తి కానుంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసిన సభల ద్వారా వచ్చిన ఆర్జీల దరఖాస్తులను స్వీకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.

# లోగిలి జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం

లోగిలి సాహితీ వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తెలుగు కవి సమ్మేళనం నిర్వహించాలని సంస్థ ప్రతినిధులు సంకల్పించుకున్నాము.

ఈ సందర్భంగా కవులకిదే మా ఆహ్వానం.

కవిసమ్మేళనంలో పాల్గొనదలచినవారు తమ పేర్లను నమోదు చేయించుకోవాల్సిందిగా కోరుతున్నాము.

వివిధ సామాజిక అంశాలను, వయక్తిక అనుభవాలను కవులు తమ కవితా వస్తువులుగా ఎంచుకోవచ్చును.

కవి సమ్మేళనం నిర్వహించు ప్రదేశం: హైదరాబాద్.

ఆసక్తి గల కవులు, కవయిత్రులు సంప్రదించగలరు

మహారథి, అధ్యక్షులు, లోగిలి సాహితీ వేదిక. సెల్: 888 5050 959/7093 882 551

# నాటి త్యాగం! నేటి ఫలం!!

రామ్‌కే బందే
రహంసె జోడే
స్వాతంత్ర్యానికి పూర్వం!
అలనాటిదే ఈ జపం!!
నేడే మా రాముని పేరున
గేలిచేస్తున్నారు రహీంను
కలియుగ రావణాశూరులు
వెర్రితలలు యజీద్‌లు
లేపుతున్నారు దుమారాన్ని
భక్తిపేరిట నిర్మిస్తారు గుడిని
మలుస్తారు రాయిని దేవుడిగా
ములుస్తారు దగడిని దర్గాగా
భలేగా చెలామణి చేయిస్తారు
లాభసాటి వ్యాపారంగా తీర్చుతారు
చిత్రమైన చిట్కాల ద్వారా
పసందైన తీరుగా ఆవిష్కరిస్తారు
లోగుట్టు లెరుగని పామర జనాలు
వలలో చిక్కుపడ్డ పక్షులై
తమలో తామే కుమ్ముకుంటారు
ఆ తర్వాత వెలెవలాబోతారు
పుణ్యం పురుషార్థం పేరున
చేస్తారు నిలువు దోపిడీని
నింపుకుంటారు సమాజ సేవకులు
వెలతి లేకుండా తమతమ బొక్కసాలు



**- వేముల భిక్షపతి**
9373147693

# స్నేహం

స్నేహమంటే.. జన్మ జన్మల బంధం
ఆత్మీయతనుపెంచే అనురాగ దీపం
అవిస్మరణీయ నిరంతర దైవిక భావన!
జీవితంలో ఎదురయ్యే
స్నేహితులు.. ఒకరా? ఇద్దరా?
ఎంతో మంది!
అమ్మ ప్రథమ స్నేహితురాలైతే
అయ్య ద్వితీయం
ఆపై.. దైవం.. అహోన్నతం!
ఇక గురువు జ్ఞానాన్ని పంచి
వ్యక్తిత్వాన్ని పెంచే ప్రముఖ స్నేహితుడు
భార్యా-భర్తలు
ఏడుజన్మల సంబంధీకులు
ఆపై పిల్లలు స్నేహాన్ని పొంది, తిరిగి
అందించేవారూ!
ఇంకా.. అక్కా-చెల్లెళ్ళూ- అన్నతమ్ముళ్ళు
చుట్టాలు-ఇరుగు పొరుగింటివారూ
వచ్చే పోయేవారూ అందరూ
సన్నిహిత స్నేహితులే!
'స్నేహం' చేసే మనసు కళ్ళువిప్పితే
జగమంతా స్నేహమయమేగా..!
అందుకే.. వసుధైక కుటుంబం' అన్న భారతీయ భావన
విశ్వంలో
అగ్ర తాంబూలాన్నందుకుంటున్నది!



**- సావిత్రి రంజోల్‌కర్**
9833497812



## 'రాలిన చుక్కలు' కవితా సంపుటి ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం టీపీఎస్‌కే ఆధ్వర్యంలో యువ కవయిత్రి విష్ణుశ్రీ రాసిన 'రాలిన చుక్కలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుద్దాల అశోక్‌తేజ కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఇంతటి పరిణతి చెందిన కవిత్వం రాసిన విష్ణుశ్రీని అభినందించారు. భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభా కార్యక్రమంలో టీపీఎస్‌కే కార్యదర్శి కె. హేమలిందు, ప్రముఖ కవి, విమర్శకులు దాస్యం సేనాధిపతి, రమాదేవి కులకర్ణి, బోల యాదయ్య, తగుళ్ల గోపాల్, నస్రీన్ ఖాన్, సలీమ, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహన్ కృష్ణ, కేపీ లక్ష్మి, సాయికిరణ్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 'విత్ టంగ్ ఇన్ చీక్- ఏ సివిల్ సర్వెంట్ రీకాల్స్' పుస్తకావిష్కరణ



ప్రభుత్వ పరిపాలనలో నిత్యం బిజీగా ఉండే ఐఏఎస్ అధికారులు, రాజకీయ నాయకులతో పాటు ప్రభుత్వ పనితీరులో ఎదురైన వివిధ రకాలైన హాస్యపు సంఘటనలతో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీపాద భలేరావు రచించిన 'విత్ టంగ్ ఇన్ చీక్-ఏ సివిల్ సర్వెంట్ రీకాల్స్' పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. జోషి, ఎంసీహెచ్ ఆర్‌డీ డైరెక్టర్, ఐఏఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీపీ ఆచార్య, మాజీ కేంద్ర ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి కె. పద్మనాభయ్య, చేతుల మీదుగా ఆవిష్కరించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని డా॥ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పుస్తక రచయిత భలేరావు మాట్లాడుతూ తన వృత్తి జీవితంలో ఎదురైన ఫన్నీ సంఘటనలకు తోడు తన సహచర అధికారులతో పంచుకున్న వివిధ ఘటనలను పుస్తకంలో రాసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఉమాపతిరావుతో పాటు పలువురు విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

## సమాచార చట్టం సామాన్యులకు వేగుచుక్క

-సభలో ప్రసంగిస్తున్న ఆచార్య మాడభూషి శ్రీధర్



పారదర్శకమైన పాలనను అందించేందుకు దోహదపడే చట్టం సమాచార హక్కు చట్టమని, ఇది సామాన్యులకు వేగుచుక్కలాంటిదని కేంద్ర సమాచారశాఖ మాజీ కమీషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని కాలరాసే విధంగా ఆ చట్టంలో మార్పులు తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. సమాచార చట్టంలో సెక్షన్ 34ను సవరించడం ద్వారా స్వతంత్రత, కమీషనర్‌కు ఇది పెద్దదెబ్బ అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో కేంద్ర సమాచార హక్కు చట్టంలో చేసిన సవరణతో భవిష్యత్తులో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా, గ్రేటర్ నాయకులు ఈటీ నర్సింహా, డాక్టర్ సుధాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మాడభూషి శ్రీధర్ హాజరయ్యారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యులు విజయలక్ష్మి, బాలమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రతాప సింగారానికి సిఎం కేసీఆర్


## -ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డికి పరామర్శ

వరంగల్ రూరల్, ఆగస్టు13 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 14న బుధవారం వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారానికి రానున్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం దశదినకర్మ కార్యక్రమానికి సీఎం హాజరై ఎమ్మెల్యేను పరామర్శించనున్నారు.

పెద్దపెల్లి జిల్లాలో ఓ కార్యక్రమానికి హాజరై అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ప్రగతి సింగారానికి రానున్నారు.

ఇదిలావుంటే పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు. ప్రగతిసింగారం గ్రామానికి స్పీకర్ చేరుకుని మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌బాబు, ఎమ్మెల్సీ ఎన్ లక్ష్మణ్‌రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణరావు, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వైస్ చైర్మన్ ఆకుల రవీందర్, వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ వీ రవీందర్, కలెక్టర్ ఎం హరిత, డీసీపీ కేఆర్ నాగరాజు, ఏసీపీ సునీతామోహన్, తదితరులు మల్లారెడ్డికి నివాళులర్పించారు.

### నేటి కవిత




# పాలేరు నీటి విడుదలకు మరింత సమయం

## 15 అడుగుల మేర నీరు చేరితేనే సాధ్యం అన్న అధికారులు

ఖమ్మం,ఆగస్టు13(ఆర్ఎన్ఎ): పాలేరు నుంచి రెండో జోన్‌కు ప్రస్తుతం నీటిని విడుదల చేసే అవకాశం లేదని, పాలేరులో కనీసం 15 అడుగుల మేర నీరు ఉంటేనే ఇది సాధ్యమవుతుందని ఎన్నెస్పీ అధికారి ఒకరు తెలిపారు. సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల పెంచినందున రెండురోజుల్లో పాలేరు రిజర్వాయర్ నిండుతుంది. పాలేరులో ప్రస్తుతం 13.6 అడుగుల నీరు ఉంది. ఈనెల 15న రెండో జోన్‌కు నీరు విడుదల చేసే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఈమేరకు ఎన్నెస్పీ అధికారులు సోమవారం రెండోజోన్ పరిధిలోని కాలువను పరిశీలించారు. సాగర్ జలాశయానికి రికార్డు స్థాయిలో నీరుచేరడంతో జిల్లాలో సాగర్ రెండు, మూడు జోన్ల పరిధిలోని సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరు అందుతుంది. మరోవైపు భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నుంచి తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, మరిపెడ మండలాల పరిధిలోని 35 చెరువులు నింపడానికి కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్ నుంచి ఎడమ కాలువకు విడుదల చేసిన నీరు సోమవారం అర్ధరాత్రి పాలేరు రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. అయితే దాదాపు ఏడు నెలల తర్వాత కాలువకు నీటిని విడుదల చేయడంతో పాలేరుకు కేటాయించిన మూడు వేల క్యూసెక్కుల నీటిలో నగర వరకే రిజర్వాయర్‌కు చేరవచ్చని ఎన్నెస్పీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు 8 లక్షల క్యూసెకులు నీరు చేరుతుండడంతో సుమారు 2 లక్షల క్యూసెక్కులు కృష్ణానదిలోకి వదిలిన విషయం తెలిసిందే.

# పారదర్శకంగా మధ్యాహ్న భోజనం

## త్వరలో పర్యవేక్షక కమిటీల ఏర్పాటు

వరంగల్,ఆగస్టు13 (ఆర్ఎన్ఎ):జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మోనూ ప్రకారం అందేలా ఇక పర్యవేక్షణ కమిటీలు వేయనున్నారు. ప్రతీవారం భోజనం పరీక్షించేందుకు ప్రత్యేకంగా గ్రామస్థాయిలో సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, విద్యావేత్తలతో కలిపి కమిటీలు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా తహసీల్దార్లు, ఎంపీడీవో, ఎంఈవోలతో త్రీమెన్ కమిటీలు మధ్యాహ్న భోజనం నాణ్యత, మోనూ పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనం విషయంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు స్థానికులు కావడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలు ఉండడంతో ఎస్ఎంసీ చైర్మన్లు గట్టిగా అడిగే పరిస్థితి లేదు. అధికారులు సందర్శనకు వస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఆ రోజు ఏజెన్సీలు నాణ్యమైన భోజనం వండి మోనూ పాటిస్తుండగా, మిగిలిన రోజుల్లో భోజనం మామూలుగానే ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలన్న నిబంధన ఉన్నా.. ఒకటి, రెండు గుడ్లతో ఏజెన్సీలు సరిపెట్టి చేతులు దులుపుకుంటున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల, విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. ఒకపక్క బియ్యం సరఫరాకు తెల్లసంచులను ఉపయోగిస్తూ విద్యార్థులు, వంట ఏజెన్సీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మధ్యాహ్న భోజన వివరాలు ఏరోజుకారోజు విద్యాశాఖకు చేరే విధానం అందుబాటులోకి వచ్చింది. ఆన్‌లైన్, ఈ-పాస్ బయోమెట్రిక్ విధానంతో ప్రతీరోజు విద్యార్థుల సంఖ్య, ఖర్చు చేసిన బియ్యం, మిగులు బియ్యం లెక్కలను పక్కాగా ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని చాలా పాఠశాలల్లో తక్కువ మంది విద్యార్థులు భోజనం చేస్తున్నా.. రికార్డుల్లో చూపుతున్న హాజరు శాతం ఆధారంగానే బియ్యం లెక్కలు నమోదు చేస్తుండేవారు. దీంతోపాటు భోజనం చేసిన విద్యార్థుల వివరాలు నెలకోసారి ఆయా మండలాల ఎమ్మార్సీ కార్యాలయంలో నమోదు చేయడం వల్ల కొన్ని ఏజెన్సీలు, కొందరు హెడ్మాస్టర్లు మధ్యాహ్న భోజనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉండేవి.

# గోదావరిని దారికి తెచ్చుకోవాల్సిందే!

హైదరాబాద్, అగష్టు 13:తెలుగువారి చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ తన కంచి పర్యటన సందర్భంగా చేసిన ప్రకటన తాజాగా మరోమారు ఆంధ్రా ప్రజలకు బరోసా నింపేదిగా ఉంది. కలసి నడుద్దామని ఇప్పటికే పిలుపునివ్వడంతో పాటు, కలసి అభివృద్ధిని సాధిద్దామని నిర్మొహమాటంగా చెప్పారు. ప్రధానంగా వృధాగా పోతున్న గోదావరి జలాలలను రాయసలసీమకు తరలిస్తేనే ఇక్కడి కరవు కాటకాలను దీటుగా ఎదుర్కోవచ్చన్న సంకల్పం ప్రకటించారు. ఇప్టపికే జగన్‌తో దఫాలుగా గోదావిరి జలాల వినియోగంపై చర్చించిన సిఎం కెసిఆర్ తాజాగా తనవైఖరనిని మరోమారు స్పష్టీకరించారు. కొందరు దీనిని ఎద్దేవా చేస్తున్నారని కూడా చెప్పుకొచ్చారు. ఎవరు ఏమి భావించినా, విమర్శలు చేసినా కలసి పోదామన్న ఆకాంక్షను ప్రకటించారు. ఇది నిజంగా ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం.

రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తాను సమన్వయం తో కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు దేవుడిచ్చిన సర్వశక్తులూ ఉపయోగిస్తామని.. జగన్‌కు పెద్దన్నలా సహకారం అందిస్తానని వెల్లడించారు. రాయలసీమ ఆర్థికంగా ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి గోదావరి జలాలు రావాల్సిన అవసరముందని.. తప్పకుండా అది సాధ్యమవుతుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. కాంచీపురంలో అత్తి వరదర్ స్వామిని దర్శించుకున్న అనంతరం తిరుగుప్రయాణంలో ఆయన చిత్తూరు జిల్లా నగరిలో వైకాపా ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్ రోజా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు మంచి పట్టుదల ఉన్న యువనాయకుడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నారని,ఆయన సారథ్యంలో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అభివృద్ధికి పరస్పర సహకారంతో కృషి చేస్తున్నామన్న కెసిఆర్ ఇది కొందరికి అర్థం కాకపోవచ్చు. మరికొందరికి జీర్ణం కాకపోవచ్చు. దానికి మేం చేయగలిగిందేమీ లేదని కూడా కుండబద్దలు కొట్టారు. ప్రజల మద్దతు ఉన్నంతకాలం తప్పకుండా రెండు రాష్ట్రాల ప్రజల కోరికలు నెరవేరేలా పనిచేస్తామని కూడా ప్రకటించారు. ఏపీకి వందశాతం నా ఆశీస్సులు, సంపూర్ణ సహకారం ఉంటాయని కూడా నిర్మొహమాటంగానే చెప్పారు. నీళ్ల విషయంలో ఇప్పటికే తాను, జగన్ చర్చలు జరిపాం. ఇప్పుడు ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. ఆ నీరు ప్రజలకు ఉపయోగపడాలనే నిర్ణయానికి వచ్చాం. గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి. వాటిని కృష్ణానదిలో కలపాలనే విషయమై మాట్లాడుకున్నాం. రాయలసీమ ప్రజల ఇబ్బందులు నాకు తెలుసు. వారి కష్టాలు తెలిసిన నాయకుడు జగన్. సీమలో వర్షాలు లేక ప్రజలు చాలా ఇక్కట్లు పడుతున్నారు. గోదావరి జలాలను వాడుకుంటే బంగారు పంటలు పండుతాయి. ప్రజల కష్టాలు తీరుతాయి. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా వెయ్యి టీఎంసీలను రాయలసీమకు మళ్లించాలన్నదే మా ఆశయం అని సీఎం కెసిఆర్ వెల్లడించారు. ఇప్పటికే జగన్‌తో చర్చించిన సిఎం కెసిఆర్ గోదావరి జలాలు ఎలా వృధాగా పోతు న్నాయో వివరించారు. ప్రస్తుత వరదలను గమనిస్తే ఎంతగా గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలిసాయో చూశాం. అందుకే గోదావరి జలాలను పూర్తిగా సద్వినయోగం చేసుకునేందుకు చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతించాలి. తెలంగాణ, ఆంధ్రా అని చూడకుండా కెసిఆర్ దూరదృష్టితో ముందు కు సాగుతున్న తీరు అభినందనీయం. సకాలంలో పని చేయగలిగే వారికి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారు. అందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ. దీనిని రికార్డు సమయంలో పూర్తి చేయించారు. తెలంగాణలో ఎన్నో గెలుపోటములకు, ఛీత్కారాలకు, సత్కారాలకు కెసిర్ ప్రత్యక్షసాక్షి. తెలంగాణ ఉద్యమ సమయంలో

అనేక ఆటుపోట్లు ఎదుర్కోవడమే కాదు.. ఉద్యమంలో ఎక్కడా వెనక్కి పోలేదు. అలా వెనక్కిపోయి ఉంటే ఇవాళ తెలంగాణ సిద్ధించేది కాదు. అయితే తెలంగాణ సాధించిన తరవాత కెసిఆర్ తీసుకున్న, తీసుకుం టున్న నిర్ణయాలు ప్రజలకు నేరుగా చేరుతున్నాయి. ఏ సిఎం చేయని సాహస నిర్ణయాలు చేశారు. కెసిఆర్ ఈ చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయేంత భీరుడు కాదు. రబ్బరు బంతి వలె తిరిగి రాగల శక్తియుక్తులు ఉన్న నేత. అందుకే ఐదేళ్ల తెలంగాణలో అనేకానేక నిర్ణయాలతో దేశానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన ప్రవేశ పెట్టిన ఒక్క రైతు బంధుచాలు... చెప్పుకోవడానికి. గత ఏడు దశాబ్దాల కాలానికి ప్రస్తుత కాలనానికి ఉన్న తేడాయే ఇక్కడ ముఖ్యం. ఎందుకంటే తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఏం జరిగిందన్నదే ముఖ్యం.. ఏమైనా మార్పు కనిపించిందా అన్నదే ప్రజలు గమనిస్తారు. గతంలో జరగని అద్భుతాలు జరగకున్నా గణనీయమైన మార్పులు సాధించామా లేదా అన్నది చూడాలి. విద్యుత్‌రంగంలో కీలకమైన మార్పులు జరిగాయి. గొప్పలకు పోతున్న ఏ రాష్ట్రంలోనూ నిరంతర విద్యుత్ ఇస్తున్న దాఖలాలు లేవు. కరెంట్ వెతలతో నానా కష్టాలు పడ్డ సామాన్యులకు, రైతులకు,పారిశ్రామికవేత్తలకు కరెంట్ లేదు..రాదు అన్న ఆలోచన లేకుండా చేసిన ఘనత కెసిఆర్‌దే. తెలంగాణ ఏర్పడ్డ తరవాత సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారనే చెప్పాలి. అలాగే తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు పడ్డాయి. అందుకే ఆయన చెప్పే మాటల్లో నిజాయితీ ఉంటుంది. చేయగలమన్న పట్టుదలా ఉంటుంది. అందుకే గోదావరి జలాలను కాళేశ్వరం ద్వారా సాకారం చేశారు. ఇప్పుడు కృష్ణానదిలోకి మళ్లించి ఎపికి అండగా ఉంటామన్న హామీలోనూ నూటికినూరుపాళ్లు చిత్తశుద్ధి కానవస్తోంది. ఇది సాకారం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయి.

# అంతరిక్షంలో త్వరలో అద్భుతాల ఆవిష్కరణ

## ఓ వైపు చంద్రయాన్...మరోవైపు ఆదిత్యుడి అంతరంగం

## పరిశోధనలకు పదును పెడుతున్న శాస్త్రవేత్తలు

హైదరాబాద్,ఆగస్టు13(ఆర్ఎన్ఎ): చంద్రయాన్ కక్షలో నిర్దిష్టంగా సాగుతోంది. ఇస్రో తన మేధోశక్తితో పంపిన చంద్రాయాన్-2 సక్రమ మార్గంలో పయనిస్తూ జాబిల్లివైపు దూసుకుని పోతోంది. ఖగోళ పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్న వేళ ఇప్పటికే అనేక రహస్యాలు ఛేదిస్తున్న మానవుడు జాబిల్లి గుట్టును తెలుసుకోబోతున్నాం. అంగారకుడి రహస్యాలను శోధిస్తున్న వేళ రోవర్ ద్వారా అక్కడి వాతావరణం గురించి పరిశోధిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలు ఒక ఎత్తయితే ఆదిత్యుడి రహస్యాలను తెలుసుకోవాలన్న ప్రయత్నం కూడా చేయాలని ప్రపంచ దేశాలు ఉవ్విళ్లూరుతున్నాయి. మండుతున్న అగ్నిగోళం ముందుకు వెళ్లి నిలబడగలాలంటే ఎంతో ధైర్యం కావాలి. మామూలు ఎండవేడిమికి తట్టుకోలేని మనం కోట్ల ఫారిన్ హీట్ వేడి కలిగిన ఆదిత్యుడిని చేరడం సామాన్య విషయం కాదు. కానీ ఇప్పటి వరకు అనేక అసాధ్యాలను సుసాధ్యం చేసిన పరిశోధకులు తమ మస్తిష్కానికి పదను పెట్టారు. అంగారక పరిశోధనలు పురోగతిలో ఉండగానే ఆదిత్యుడిపై ఆసక్తి పెరిగింది. మండే అగ్నిగోళం సూర్యుడి గుట్టువిప్పడమే లక్ష్యంగా ఇప్పటికే తొలి అడుగు పడింది. నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ సూర్యుని వద్దకు ప్రయాణాన్ని ప్రారంభించింది. ఉపగ్రహాల చరిత్రలోనే ప్రోబ్ అత్యంత వేగంగా కదులుతుందని నాసా శాస్త్రవేత్తలు ప్రకటించారు. సూర్యునిపై ఉండే దుర్భరమైన వాతావరణ పరిస్థితులను, రేడియోధార్మికతను తట్టుకునేగలిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇతర ఉపగ్రహాలతో పోలిస్తే 500 రెట్లు ఎక్కువగా ఉష్ణాన్ని తట్టుకోగలిగే పటిష్టవంతమైన కవచాన్ని ఏర్పాటు చేశారు. సూర్యుని విషయంలో ఉన్న అనేక సందేహాలను, రహస్యాలను ఈ స్పేస్ క్రాఫ్ట్ ఛేధిస్తుందని శాస్త్రవేత్తలుజ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సూర్యుడి ఉపరితల వాతావరణ వలయమైన కరోనాలోకి వెళ్లడం ఈ పరిశోధన లక్ష్యం. ప్రోబ్ శుక్రుడి గురుత్వాకర్షణ శక్తిని వినియోగించుకుని తన కక్ష్య నిడివిని తగ్గించుకుని, వేగాన్ని మార్చుకుని ఏడు సంవత్సరాల అనంతరం 2024నాటికి సూర్యుని ఉపరితలాన్ని చేరుకుంటుంది. సూర్యుని చుట్టూ 24 కక్ష్యలలో తిరిగి కరోనాను అధ్యయనం చేస్తుంది. అక్కడ భూమిని ప్రభావితం చేసే ప్రదేశాన్ని గుర్తిస్తుంది. పార్కర్ సోలార్ ప్రోబ్ భూమి, సూర్యుల మధ్య దీర్ఘవృత్తాకార కక్ష్యలోకి ప్రవేశిస్తుందని, ఈ కక్ష్యలో ఒక భ్రమణం పూర్తి చేయడానికి 88రోజులు పడుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. చంద్రుడి మీద కాలుడి నట్లు అమెరికా చెప్పుకున్నా ఆ తరవాత ఎందుకనో దానిలో పురోగతి కానరాలేదు. దీంతో ఆ ప్రయోగంపై ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక అనుమానాలు తొలుస్తున్నాయి. అయితే చంద్రయాన్ ద్వారా భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో ప్రయాగాలు ఫలించాలంయి. చంద్రుడిపై నీటి జాడలు ఉన్నాయని మనవారు గుర్తించారు. ఈ దశలో ఓ వైపు అంగారక గ్రహంపై పరిశోధనలను రోవర్ ముమ్మరం చేసింది. ఇదిలావుండతానే ఆదిత్యుడి గుట్టు తెలుసుకునే ప్రయత్నంలో అమెరికా నాసా ప్రయోగం విజయం దిశగా సాగుతోంది. సూర్యునికి అత్యంత సమీపంగా వెళ్లే ఉపగ్రహం కావడంతో ఈ ఉపగ్రహానికి అనేక ప్రత్యేకతలున్నాయి. దీని రూపకల్పనలో శాస్త్రవేత్తలు ఏళ్లకొద్ది గడిపారు. ఆదిత్యుడి గుట్టును విప్పేందుకు ఇది ఏడేళ్ల సుదీర్ఘ ప్రయాణం చేయనుంది. సౌర బాహ్యపొర కరోనా, అంతరిక్షంపై అది చూపుతున్న ప్రభావం మీద ప్రధానంగా ఇది దృష్టి కేంద్రీకరించనుంది. సౌర తుపానులతో ఉపగ్రహాలు దెబ్బతింటాయి. కక్ష్యలోని వ్యోమగాముల ప్రాణాలకూ వీటితో ముప్పు పొంచివుంది. రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలు, పవర్ గ్రిడ్‌లనూ ఇవి ధ్వంసం చేయగలవు. తాజా ప్రోబ్‌తో ఈ ముప్పులను మెరుగ్గా అంచనా వేసేందుకు వీలుపడుతుందని నాసా తెలిపింది. భూమిపై సంభవించే పరిణామాలతోపాటు విశ్వాన్ని మెరుగ్గా అర్థం చేసుకొనేందుకు ఈప్రయోగం తోడ్పడుతుంది. ఏడేళ్లలో ఏడుసార్లు శుక్రుడి గురుత్వాకర్షణ శక్తితో ఇది కక్ష్యను పెంచుకుంటుంది. క్రమంగా ఇది సూర్యుడికి చేరువవుతుంటుంది. చివరగా భానుడి ఉపరితలం నుంచి 38లక్షల మైళ్ల ఎత్తులో ఉంటుంది. ఈ సమయంలో దీని వేగం గంటకు ఏడు లక్షల కి.మీ. ఉంటుంది. అత్యంత వేగంగా కదులుతున్న వ్యోమనౌకగా ఇది రికార్డు సృష్టించనుంది. సూర్యుడికి దగ్గరగా వెళ్లినప్పుడు ఇది 1,377 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఎదుర్కొంటుంది. మొత్తంగా అంతరిక్ష పరిశోధనల్లో అనేక అద్భుతాలు త్వరలోనే ఆవిష్కృతం కానున్నాయి.

# ధవళేశ్వరం వద్ద ప్రశాంతంగా గోదావరి

## తగ్గిన వరద ఉధృతితో తేరుకుంటున్న గ్రామాలు

## అంటురోగాలు వ్యాప్తి చెందకుండా చర్యలు

ధవళేశ్వరం,ఆగస్టు13 (ఆర్ఎన్ఎ): కొన్ని రోజులుగా గోదావరి నది ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటి మట్టం క్రమంగా పెరగడంతో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు సాధారణ పరిస్థితికి వచ్చింది.ప్రస్తుతం వరదనీరు క్రమంగా పెరుగుతోందని, ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరలేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి మరంతగా వరదనీరు వస్తే పరిస్థితిని పరిశీలిస్తామన్నారు. సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం ప్రభావం కనిపించింది. విలీన మండలాల్లో పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. ఇక్కడ భారీ వర్షపాతం నమోదు కావడంతో చాలాచోట్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. కోనసీమ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో ఇక్కడ జనజీవనానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ ప్రాంతంలోని 16 మండలాల్లో వర్షాల ప్రభావంతో రహదారులు ఛిద్రంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం ప్రభావం కనిపించింది. మెట్ట ప్రాంతంలో ఓ మోస్తారు నుంచి చినుకులు పడ్డాయి. విలీన మండలాల్లో పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలు మెట్ట ప్రాంతానికి మేలు చేస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న, పత్తి, అపరాలు, మిర్చి వంటి సాగుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. రెండు రోజుల వ్యవధిలోనే వరద ప్రవాహం 15 లక్షల క్యూసెక్కుల నుంచి అయిదు లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. వరద తగ్గుముఖం పట్టడంతో ఇప్పటి వరకు జలదిగ్బంధంలో ఉన్న దేవీపట్నం కొంత మేరకు కోలుకుంది. గ్రామాల చుట్టూ నీరు తొలగిపోయినా ఇళ్లు మాత్రం ముంపులోనే ఉన్నాయి. దండంగి వాగు ఉధృతి కొనసాగుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు కోనసీమలోని లంక గ్రామాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. దీంతో స్థానికంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు తొలగించారు. లంక గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. కొళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్డీవో వెంకటరమణ తెలిపారు. వరదనీరు తగ్గడంతో అపరిశుభ్ర వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పారిశుద్ధ్య పనులతో పాటు వైద్య సేవలను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. వరద తగ్గిపోవడంతో కాజ్‌వేలను దాటి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఐ.పోలవరం, పి.గన్నవరం మండల్లాలోని లంక గ్రామాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇంజిన్ పడవల్లో స్థానికులు ప్రయాణాలు సాగిస్తున్నారు.

## ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

## గడ్కరీ తదితరులకు తప్పిన ముప్పు

నాగపూర్,ఆగస్టు13(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి, నాగపూర్ నియోజవర్గం ఎంపీ నితిన్ గడ్కరి మంగళ వారం ఉదయం ఎక్కిన ఇండిగో విమానంలో సాంకేతక లోపం తలెత్తి ంది. నాగపూర్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన 6ఇ 636 ఇండిగో విమానం కొద్ది నిమిషాల్లో టేకాఫ్ తీసుకుంటు ందనగా అందులో సాంకేతిక లోపం తలెత్తినట్టు పైలెట్ గుర్తించారు. దీంతో గడ్కరి సహా ప్రయాణికులందరినీ ఖాళీ చేయించి విమానాన్ని రన్‌వే నుంచి టాక్సీవే వైపు వెనక్కి తీసుకెళ్లారు. సాంకేతిక లోపం వల్లే విమానం నిలిపివేసినట్టు నాగపూర్ విమానాశ్రయ సీనియర్ డెరెక్టర్ విజయ్ ములేకర్ తెలిపారు. తీవ్రమైన సాంకేతిక సమస్యల కారణంగా దీంతో చివరి నిమిషంలో నాగపూర్ విమానాశ్రయంలో నిలిచిపోయింది. విమానంలో ఉన్న గడ్కరీతో సహా ఇతర ప్రయాణికులందరినీ దించివేసి వారిని వేరే విమానంలో ఢిల్లీకి పంపుతున్నట్లు విమానాశ్రయ అధికారి ఒకరు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com